# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :122 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 15-07-2025 | పేజీలు:4 వెల: 2.00


## ఢిల్లీలోని పలు పాఠశాలలకు బాంబు బెదిరింపులు..

న్యూఢిల్లీ, దేశంలో బాంబు బెదిరింపులు కొనసాగుతున్నాయి. తాజాగా ఢిల్లీ లోని పలు పాఠశాలలకు సోమవారం ఉదయం ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆయా పాఠశాలల్లో తనిఖీలు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీలోని చాణక్యపురిలో గల నేవీ స్కూల్, ద్వారక ప్రాంతంలోని సీఆర్‌పీఎఫ్ పాఠశాలకు సోమవారం ఉదయం బాంబు బెదిరింపులు వచ్చాయి. రెండు పాఠశాలలకు ఫోన్ చేసిన ఆగంతకులు స్కూల్స్ ఆవరణలో బాంబులు పెట్టినట్లు బెదిరించారు. దీంతో అప్రమత్తమైన పాఠశాలల యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన ఢిల్లీ పోలీసులు రెండు పాఠశాలల్లోనూ తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## కవితను పిచ్చి తిట్లు తిట్టిన మల్లన్న..



హైదరాబాద్,ఇవీ తీన్మార్ మల్లన్న లేటెస్ట్ తిట్లు. మళ్లీ అదే భాష.. ఈసారి అంతకుమించి తిట్లు.. ఇంత గొడవ అవుతున్నా ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కుమార్ అసలేమాత్రం తగ్గట్లే. మరింత రెచ్చిపోయారు. తన యూట్యూబ్ ఛానెల్‌లో ఎర్లీ మార్నింగ్ మరోసారి కవితపై తిట్ల దండకం అందుకున్నారు. ఆదివారం నాటి గొడవ, దాడితో పాటు కంచం, మంచం డైలాగ్‌పైనా మరింత చిచ్చు రాజేశారు. ఆ మాట తెలంగాణ వాడుకలో చాలా పాపులర్ అంటూ చెప్పుకొచ్చారు. గతంలో కేసీఆర్ రాసిన ఓ సామెతల పుస్తకంలో ఇదే డైలాగ్ ఉందంటూ స్క్రీన్ మీద ఆ బుక్‌లోని పేజీలను చూపిస్తూ.. చదివి వినిపించారు. ఆ సందర్భంగా సిగ్గు, శరం, లజ్జ.. నీ అయ్యని చెప్పుతో కొట్టు.. హౌల పోరీ, ఏడ పన్నవ్ తల్లీ.. అంటూ మరింతగా తిట్ల డోస్ పెంచారు తీన్మార్ మల్లన్న. లేటెస్ట్ ఎపిసోడ్‌తో కవితతో గొడవ మరింత పీక్స్‌కు చేరినట్టే కనిపిస్తోంది.

అదే భాష.. అవే తిట్లు..

మల్లన్న అంటే మాస్ జాతర అని అందరికీ తెలిసిందే. అయితే, కవిత విషయంలో ఆయన వాడిన భాషను మాత్రం ఎవరూ సమర్థించట్లేదు. పీసీసీ చీఫ్ సైతం తప్పుబట్టారు. ఆఫీసుపై అటాక్, మల్లన్నపై దాడి, గన్‌మెన్ ఫైరింగ్, పరస్పరం కంప్లైంట్స్.. ఇలా ఆదివారం అంతా రచ్చ రచ్చ జరిగింది. కట్ చేస్తే.. మండే మార్నింగ్ ఫ్రెష్‌గా మరోసారి అదే భాష.. అవే తిట్లతో మళ్లీ కవితపై విరుచుకుపడ్డారు మల్లన్న. అసలు ఎక్కడికి పోతోంది వివాదం?

ఎందుకీ ఓవరాక్షన్?

బీసీల క్రెడిబిలిటీ కోసం మల్లన్న ఆరాటం, కవిత పోరాటం ఇంత వరకూ వచ్చిందంటున్నారు. కులగణన చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది రేవంత్ సర్కారు. మధ్యలో ఈ ఇద్దరు ఎమ్మెల్సీల లొల్లి ఏందంటూ తెలంగాణ సమాజం అవాక్కవుతోంది. ఆయనేమో యూట్యూబ్ మాటున మాటల మంట రాజేస్తున్నారు. ఆవిడేమో ధర్నాలు, దాడులతో బీసీల అగ్గి ఎగదోస్తున్నారు. ఉనికి కోసం కాకపోతే ఏందీ ఓవరాక్షన్ అంటూ అంతా చీదరించుకుంటున్నారు.

ఎవరు రైట్? ఎవరు రాంగ్?

కంచం మచం అని అనటం తెలంగాణలో కామనే అయినా.. ఆ పద ప్రయోగం ఓ మహిళ విషయంలో ఎవరూ వాడరు. రాండంగ్‌గా అలా అంటారంతే. కానీ, మల్లన్న సూటిగా కవితనే టార్గెట్ చేస్తూ ఆ భాష వాడటమే ఇప్పుడింతటి కాంట్రవర్సీకి కారణం. ఆ విషయంలో అంత రచ్చ అయ్యాక కూడా.. మల్లన్న మళ్లీ అలాంటి తిట్లే తిట్టడం ఆయనకే చెల్లింది. దాడులు, కాల్పుల వరకూ వెళ్లినా తగ్గేదేలే అంటూ డోస్ పెంచడంతో ఈ ఇష్యూ ముందుముందు ఎక్కడిదాకా వెళ్తుందో అనే టెన్షన్ నెలకొంది. టోటల్ ఎపిసోడ్‌లో ఎవరిది తప్పు, ఎవరు ఒప్పు అనేది పక్కనపెడితే.. మహిళ విషయంలో వాడిన భాషపైనే అభ్యంతరాలన్నీ.

## వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి.. మహమ్మారి వెంటాడుతుంది.. భవిష్యవాణి వినిపించిన స్వర్ణలత



సికింద్రాబాద్: సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి బోనాల జాతరలో ప్రధాన ఘట్టమైన రంగం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. ఈ ఏడాది వర్షాలు తప్పకుండా కురుస్తాయని, పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని చెప్పారు. రాబోయే రోజుల్లో మహమ్మారి వెంటాడుతుందని, అగ్నిప్రమాదాలు కూడా సంభవిస్తాయని తెలిపారు. జాగ్రత్తగా ఉండాలని భక్తులను హెచ్చరించారు. రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడే భారం తనదని చెప్పారు. బాలబాలికలను మీరు విచ్చలవిడిగా వదిలేస్తున్నారని, కానీ నేను కడుపులో పెట్టుకుని కాచుకుంటున్నాని చెప్పారు. కాలం తీరితే ఎవరు ఏది అనుభవించాలో అది అనుభవిస్తారని, తాను అడ్డురానని పేర్కొన్నారు.'బోనాల జాతరకు సంతోషంగా సాకలు పోసి బాగా చేశారు. ప్రతీసారి చేసినట్టే ఈ సారి కూడా పొరపాటు చేశారు. ప్రతి సంవత్సరం చెబుతునా.. నా బిడ్డలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటాను. నా పూజలు అన్ని సక్రమంగా జరిపించాలి. వేల రాసులు నేను రప్పించుకుంటున్న. నాకు రక్తం బలి ఇవ్వడం లేదు. మీరు మాత్రం ఆరగిస్తారు. నాకు మాత్రం ఇవ్వడం లేదు.. నాకు సరిగ్గా పూజలు చెయ్యకపోతే రక్తం కక్కుకొని చస్తారు.నాకు పూజలు సరిగ్గా జరిపించడం లేదు.. అందుకే మరణాలు పెరుగుతున్నాయి. నేను అస్సలు ఆ విషయంలో అడ్డుపడను. నాకు రక్తం బలి కావాలి. నన్ను కొలిచే వారికి నేను ఎప్పుడు తోడుగా నిలబడుతాను. రాబోయే రోజుల్లో మహమ్మారి వస్తుంది. ప్రజలు జాగ్రత్త ఉండాలి. అగ్ని ప్రమాదాలు బాగా జరుగుతాయి. ఈ సంవత్సరం కూడా వర్షాలు బాగా కురుస్తాయి. ఐదు వారాలు పాటు నాకు పూజలు, సాక పోసి ఆనంద పరచాలి. నాకు రక్తం చూపించండి లేకపోతే అల్లకల్లోలం జరుగుతుంది. నా రూపాన్ని పెట్టడానికి కూడా అడ్డుపడుతున్నారు.' అని మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు.

## బీసీలకు కాంగ్రెస్ అన్యాయం.. రామచందర్‌రావు ఫైర్



నల్లగొండ: అర్హత ఉన్న అందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యకర్తలకే రేషన్ కార్డులు ఇస్తున్నారని.. మిగతా వారి పరిస్థితి ఏమిటనీ ప్రశ్నించారు. రేషన్ బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వమే ఇస్తోందని స్పష్టం చేశారు. రేషన్ షాపుల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫొటో పెట్టాలని సూచించారు. ఇవాళ(సోమవారం) నల్గొండ జిల్లాలో రామచందర్‌రావు పర్యటించారు. ఆయనకు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.

బీజేపీ నేతలకు రాబోయే ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మీడియాతో మాట్లాడారు.తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనేనని నొక్కిచెప్పారు. తమ కార్యకర్తల కళ త్వరలో నెరవేరబోతుందని ఉద్ఘాటించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గ్రామగ్రామాన కాషాయం జెండా ఎగరవేయాలని బీజేపీ శ్రేణులకు మార్గనిర్దేశం చేశారు. కాంగ్రెస్‌కి ఓట్లు వేసి ప్రజలు బాధపడుతున్నారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ పార్టీలని.. నల్లగొండలో ఆ రెండు పార్టీల్లోని కుటుంబాలే పరిపాలిస్తున్నాయని విమర్శించారు. మతపరమైన రిజర్వేషన్లను తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. బీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ పోరాడుతోందని స్పష్టం చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనను చూశారని.. బీజేపీకి ఒక అవకాశం ఇవ్వాలని రామచందర్‌రావు కోరారు.

## విమానంలో ఎలాంటి సమస్యలు లేవు.. ఎయిరిండియా సీఈవో ప్రకటన



అహ్మదాబాద్:అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై వచ్చిన ప్రాథమిక నివేదికపై ఎయిరిండియా సీఈవో కాంప్‌బెల్ విల్సన్ స్పందించారు. ప్రమాదానికి గురైన విమానంలో ఎలాంటి సమస్య లేనట్లుగా తెలిపారు.ఇంజిన్‌లో గానీ.. స్విచ్‌ల్లో గానీ ఎలాంటి నిర్వహణ సమస్యలు లేవని తేల్చి చెప్పారు. బోయింగ్ విమానం పూర్తిగా సేఫ్‌గా ఉందని ఎయిరిండియా సీఈవో తెలిపారు. ఇంధన స్విచ్‌లపై వస్తున్న కథనాలు పూర్తిగా అవాస్తవం అని తేల్చారు. ఆ స్విచ్‌లను ఎయిరిండియా రెండు సార్లు మార్చినట్లుగా సమాచారం. ఇక ఇంధన స్విచ్‌లు పూర్తిగా సురక్షితమని అమెరికాకు చెందిన సంస్థ కూడా తేల్చింది. అయితే విమానం టేకాఫ్ అయిన తర్వాత రెండు స్విచ్‌లు ఎందుకు ఆపివేయబడ్డాయన్న దానిపై దర్యాప్తు జరుగుతోంది. ఒకేసారి రెండు ఇంధన స్విచ్ ఆఫ్‌లు ఆగడంతో ఇంధన సరఫరా నిలిచిపోయింది. దీంతో సెకన్ల వ్యవధిలోనే విమానం ఎయిర్‌పోర్టు సమీపంలో కూలిపోయింది.ఇక విమానం అహ్మదాబాద్ నుంచి లండన్‌కు వెళ్లే ముందు ఇద్దరు పైలట్లకు శ్వాస పరీక్షలు నిర్వహించారు. ఆ పరీక్షలో వారిద్దరూ బాగానే ఉన్నారు. ఇక వేరే వైద్య పరీక్షలు మాత్రం జరగలేనట్లుగా సమాచారం. ఇంకా పూర్తిగా దర్యాప్తు ముగియలేదని.. ముందుగానే లేనిపోని కథనాలు సృష్టించొద్దని విల్సన్ కోరారు. ప్రమాదానికి కొన్ని రోజుల ముందే విమానాన్ని తనిఖీలు చేశామని.. సేవలకు అనుకూలంగా ఉన్నాదని నిర్ధారించుకున్నాకే ఉపయోగించినట్లు చెప్పారు. ప్రతి విమానాన్ని తనిఖీలు చేస్తామని.. అంతేకాకుండా ఏవైనా కొత్త సూచనలు వస్తే వాటిని కూడా పాటిస్తూ ఉంటామని విల్సన్ చెప్పుకొచ్చారు. విమాన ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్న బృందంలో విల్సన్ కూడా ఉన్నారు.

ఆత్మహత్య వార్తలు ఖండన..

ఇదిలా ఉంటే పైలట్ ఆత్మహత్య చేసుకోవడం వల్లే అహ్మదాబాద్ విమాన ప్రమాదం జరిగినట్లుగా అంతర్జాతీయ మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. అయితే ఈ వార్తలను పైలట్ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. చనిపోయిన వారిని దూషించొద్దని కోరాయి. ఊహాగానాలకు తావు ఇవ్వొద్దని.. పారదర్శకత కోసం పిలుపునిస్తున్నట్లు తెలిపాయి. దయచేసి ఎవరిని బలిపశువులను చేయొద్దని కోరాయి. పైలట్ ఆత్మహత్యకు పాల్పడినట్లుగా వస్తున్న మీడియా కథనం పట్ల తీవ్రంగా కలత చెందినట్లు ఎయిర్ ఇండియాలో నారో-బాడీ పైలట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఐసీపీఏ తెలిపింది. నిశ్చయాత్మక ఆధారాలు లేకుండా పైలట్లను నిందించడం ఏ మాత్రం భావ్యం కాదని పేర్కొన్నాయి.జూన్ 12న అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఎయిరిండియా విమానం లండన్‌కు బయల్దేరింది. టేకాఫ్ అయిన కొన్ని సెకన్లకే విమానం సమీపంలోని హాస్టల్‌పై కూలిపోయింది. ఒక్కరు మినహా 241 మంది చనిపోయారు. హాస్టల్‌లో మెడికోలు కూడా చనిపోయారు. ఇలా మొత్తం 271 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల కుటుంబాలకు ఎయిరిండియా రూ.కోటి పరిహారం అందించింది.

## నిర్బంధంలో కాదు.. స్వేచ్ఛ వాతావరణంలో పండుగలు జరగాలి




హైదరాబాద్, జులై 14: ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర సందర్భంగా ఎంతో మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. సాయంత్రం పలారం బండి ఊరేగింపు ఉంటుందన్నారు. పండుగ అనేది నిర్బంధాల మధ్యన జరిగితే భక్తులు ఇబ్బంది పడతారని అభిప్రాయపడ్డారు. అనేక సంవత్సరాల నుంచి కొందరి కోఆర్డినేషన్‌తో పండుగను నిర్వహించుకున్నామని గుర్తుచేశారు. 2014లో తెలంగాణ వచ్చినప్పటి నుంచి రాష్ట్ర పండుగగా బోనాల ఏర్పాట్లు చేశామన్నారు. సహకరించినటువంటి స్థానిక ప్రజలకు, ఆర్గనైజేషన్లకు, అధికారులకు అభినందనలు తెలియజేశారు. దేవాలయంలో పనిచేసే వారికి, ఆర్గనైజేషన్ అందరికీ అభినందనలు తెలిపారు. పండుగలు, జాతరలు అనేది నిర్బంధనంలో జరగవద్దని.. స్వేచ్ఛ వాతావరణంలో జరగాలని చెప్పుకొచ్చారు. నాలుగు గంటల పది నిమిషాలకు బ్రహ్మ ముహూర్తం అని ఎవరు చెప్పారని ప్రశ్నించారు. గతంలో ఎన్టీ రామారావు మూడు గంటలకు వచ్చేవారని.. మొదటి పూజ మూడు గంటలకే జరిగేదని నిన్న మాత్రం ఆలస్యంగా జరిగిందన్నారు. అందరి సహకారంతో పండుగను జయప్రదం చేయాలన్నారు. పలారం బండి ఊరేగింపులో చాలా ఆటంకాలు జరుగుతున్నాయని.. అధికార యంత్రాంగం పూర్తిగా సహకరించాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు.కాగా.. నిన్న (ఆదివారం) సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో బోనాలు ఘనంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. బోనాలు పండుగ తర్వాతి రోజు అంటే ఈరోజు ఆలయంలో రంగం కార్యక్రమం కూడా వైభవంగా జరిగింది. ఈ సారి కూడా వర్షాలు బాగా కురుస్తాయని మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు.తనకు సక్రమంగా పూజలు చేయాలని.. లేకపోతే అల్లకల్లోలం సృష్టిస్తానంటూ అమ్మవారు హెచ్చరించింది.

## ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలకు మంత్రి పొన్నం కౌంటర్




హైదరాబాద్: తెలంగాణ బీజేపీ నేతలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలకు పొన్నం కౌంటరిచ్చారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి వచ్చే నిధులను ఆయనే ఆపుతున్నారని ఘాటు విమర్శలు చేశారు.మంత్రి పొన్నం ప్రభాకర్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ..'కాంగ్రెస్ పార్టీ బీసీల చాంపియన్. గుడ్డుకు వెంట్రుక కట్టే పని పెట్టుకోవద్దని బీజేపీ నేతలకు విజ్ఞప్తి చేస్తున్నాం. బీజేపీ నేతలు అరవింద్, బండి సంజయ్, ఈటల రాజేందర్, లక్ష్మణ్, కృష్ణయ్య గారు బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలపాలని కోరుతున్నాం. తెలంగాణ కుల గణన విప్లవాత్మక నిర్ణయమని స్వయానా వారణాసి ప్రజా ప్రతినిధి (ఆర్ఎస్ఎస్)నేత నాతో అన్నారు. బీజేపీ నేతలు దుర్బుద్ధిని వీడండి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.. అంతకంటే ముందు ఇచ్చిన హామీ మేరకు స్పష్టమైన విధానంతో కుల సర్వే నిర్వహించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల చట్టం తీసుకొచ్చాం.చట్టం 3, 4 ప్రకారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తాం. బీజేపీ లక్ష్మణ్ అసహనంతో మాట్లాడున్నారు. రాష్ట్రానికి కేంద్రం నిధులు మీరే ఆపారు. చట్టపరమైన అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని బీసీ రిజర్వేషన్ల బిల్లును ముందుకు తీసుకెళున్నాం. కడుపులో కత్తులు పెట్టుకొని మాట్లాడకండి. బీసీ రిజర్వేషన్ల పట్ల మాకు చిత్త శుద్ధి ఉంది. రాష్ట్రపతి ఆమోదం పొందించి తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చేలా కేంద్రాన్ని ఒప్పించండి. ప్యూడల్ సిద్ధాంతాలతో అడ్డుపడకండి. బిల్లు చట్టబద్ధత కోసం సీఎం రేవంత్, మంత్రులందరం సిద్ధంగా ఉన్నాం.. మీ నాయకులను తీసుకుని రండి ఢిల్లీకి వెళ్దాం.బీఆర్ఎస్ అధ్యక్ష పదవి, కార్యనిర్వాహక పదవి బీసీలకు ఇవ్వలేరా?. ఆర్డినెన్సు తీసుకొచ్చే అవకాశం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. బీఆర్ఎస్, బీజేపీ రెండు ఒక్కటే.. దొంగ దొంగ అంటూ డ్రామాలు చేస్తున్నారు. ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కోసం 50 శాతం ఎత్తేసినపుడు.. బీసీ రిజర్వేషన్లు ఎందుకు సాకారం కాదు అని ప్రశ్నిస్తున్నా. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ పార్టీ అయినా సరే గెలిచేది బీసీ అభ్యర్థి అనే విషయం మరిచిపోకూడదు. బీసీ రిజర్వేషన్లకు మద్దతు ఇవ్వాల్సిందిగా అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నా' అంటూ వ్యాఖ్యలు చేశారు.

## సరోజా దేవి మృతి.. రేవంత్, పవన్ కల్యాణ్ సంతాపం



హైదరాబాద్ : ప్రముఖ నటి, పద్మభూషణ్ గ్రహీత బి.సరోజా దేవి మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం ప్రకటించారు. చలనచిత్ర రంగంలో ముఖ్యంగా తెలుగు,కన్నడ,తమిళ సినిమాల్లో మరిచిపోలేని అనేక పాత్రలు పోషించారని గుర్తుచేసుకున్నారు. చలనచిత్ర రంగంలో వారు లేని లోటు పూడ్చలేనిదని, సరోజాదేవి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

చిత్రసీమపై బి సరోజది చెరగని ముద్ర : పవన్ కల్యాణ్

చలనచిత్ర రంగంలో బి సరోజది చెరగని ముద్ర అంటూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.. ఆమె కన్నుమూశారని తెలిసి బాధపడ్డానని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాని పేర్కొన్నారు. 1955 నుంచి దాదాపు మూడు దశాబ్దాల పాటు తెలుగు , కన్నడ , తమిళ భాషా చిత్రాల్లో నటించి చిత్రసీమపై తనదైన ముద్రను వేశారన్ని తెలిపారు. భూకైలాస్, పాండురంగ మహత్యం, సీతారామ కళ్యాణం, జగదేకవీరుని కథ, శకుంతల, దానవీర శూర కర్ణ, ఆత్మబలం లాంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన విషయాన్ని పవన్ గుర్తు చేసుకున్నారు.

## 5 రోజుల్లో పూర్తిస్థాయి సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల



హైదరాబాద్: సాగర్ ఆయకట్టు కింద 2.5 లక్షల ఎకరాలకు నీరు ఇస్తున్నాం అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సాగర్ ఆయకట్టుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం జిల్లాలో పాలేరు జలాశయం నుంచి సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం 400 క్యూసెక్కుల నీరు విడుదల చేశామని అన్నారు. రాబోయే 5 రోజుల్లో పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరు విడుదల చేస్తామని తెలియజేశారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా రైతు పథకాలు అమలు చేస్తున్నామని, రైతుభరోసా రైతులకు ఎకరాలకు రూ.12 వేలు అందించామని, రైతుల ఖాతాల్లో 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు జమ చేశామని చెప్పారు. సన్న ధాన్యానికి క్వింటాళ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామని, రాబోయే రోజుల్లో మిగిలిన పంటలకు కూడా బోనస్ ఇస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## సంపాదకీయం

మంగళవారం 15-07-2025

# ఉచిత పథకాలు ఎవడబ్బ సొమ్ము !

అప్పులు చేసి అభివృద్ధి చేస్తున్నామన్న పాలకుల ధోరణి కారణంగా ..ఏటేటా రాష్ట్రాల్లో అప్పుల మూట పెరుగుతోంది. ఉచిత పథకాలే అభివృద్ధి అన్నచందంగా పాలన సాగుతోంది. అభివృద్ధి పక్కకుపోయింది. కేవలం పందేరాలు కొనసాగుతున్నాయి. విద్య,వైద్యరంగాలను విస్మరించారు. మంచినీటి సరఫరా సరిగా జరగడం లేదు. రోడ్ల విస్తరణ కానరావడం లేదు. దోమల నిర్మూలన అటకెక్కింది. పారిశుద్ధ్యం పడకేసింది.గ్రామాల్లో ఆర్థిక కార్యకాలాపాలు సాగడం లేదు. ఈ క్రమంలో కొత్తకొత్త పథకాలతో ప్రజలకు దోచిపెడుతూ దానకర్ణుడిలా గొప్పలు చేసామని తెలుగు వల్లభులు చాటుకుంటున్నారు. చేతికి ఎముక లేదన్నట్లుగా పథకాలతో ఖజానాను ఊడ్చేస్తున్నారు. ఇదంతా అభివృద్ధిగా చూపుతూ..దేశమంతా ఇదే పాటించాలన్న డిమాండ్‌ను పెడుతున్నారు. ఉచిత విద్యుత్, కిలో రూపాయికే సన్న బియ్యం, ఉచిత బస్సు, ఇంటింటికీ పెన్షన్లు వంటి పథకాల జోరు కొనసాగుతోంది. వీటికి తోడు కులాల కుంపట్లు రగిలిస్తున్నారు. ఇవన్నీ అమలు చేయడానికి అప్పులు చేయడం, వడ్డీలకు మళ్లీ అప్పులు చేయడం, వివిధ రకాల్లో పన్నులు వడ్డించడం అలవాటయ్యింది. ఆదాయం పెచే శాఖలపై అదేపనిగా సమీక్షలు చేయడం చేస్తున్నారు. నిజానికి రైతులకు ఎంత ఉచిత విద్యుత్ అవసరమో లెక్కలేదు. ఎవరికి ఎంత పొలం ఉంది..వారికి ఎంత విద్యుత్ అసవరం.. వారు ఏ పంటలు పండిస్తున్నారో లెక్కలు తీయడం లేదు. ఉచిత విద్యుత్ పొందుతున్న వారిలో ఎందరు పంటలు పండిస్తున్నారు.. ఏ పంటలు పండిస్తున్నారు..అన్న లెక్కలు కూడా లేవు. కొందరు ఇతరత్రా పనులకు ఉచిత విద్యుత్‌ను ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిజానికి ఉచిత విద్యుత్‌ను కూడా లెక్కగట్టి ఇవ్వాలి. ఏ పంట పండిస్తారో చూడాలి. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బులతో విద్యుత్ కొని ఇస్తున్నప్పుడు దానికి లెక్కా పత్రం ఉండాలి. ప్రజలను ఆదుకోవడం వేరు..ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం పథకాలను అమలు చేయడం ద్వారా తమను తాము గప్ప పాలకులుగా భావిస్తున్నారు. ఇప్పుడు ఖర్చు పెడుతున్న ప్రతిపైసా వీరి జేబులోంచి తీయడం లేదు. కనీసం ఒక్క రూపాయి కూడా ఇందులో కలపడంలేదు. రైతుభరోసా కావచ్చు...రుణమాఫీ కావచ్చు...ఇతర పథకాలు కావచ్చు..దుబారాను అరికట్టాలి. దూరదృష్టి లేకుండా పథకాల పేరుతో దుబారా చేస్తే నష్టపోయేది రాష్ట్రప్రజలే అని గుర్తించాలి. రూపాయికే కిలో బియ్యం అన్నది అర్థం లేని పథకంగా ఇప్పటికే గుర్తించాల్సింది. అయినా దానిని సమీక్షించడం లేదు. ఇలాంటి పథకాలు గుదిబండగా మారుతున్నాయి. ఓ రకంగా చెప్పాలంటే దళారీలకు దందాలు చేసే పథకంగా మారింది. ఇలాంటి పథకాల వల్ల ఆర్థిక దుర్భర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చే ప్రమాదం రాకుండా చూసుకోవాలి. ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్ర వల్లభులు దీనిపై పాఠాలు నేర్చుకోవాలి. జీతాలకు ఇవ్వలేక, అభివృద్ధి పనులు చేపట్టలేక, ఉన్నది ఉచితంగా దోచిపెడుతూ తామేదో ఘనకార్యం చేస్తున్నామనుకుంటున్న కాంగ్రెస్, కూటమి పాలకులు కళ్లు తెరవాలి. పథకాల కోసం కొత్తగా డబ్బుల వేట మొదలు పెట్టడం, అప్పులు చేయడం సరైనపని కాదని గుర్తించాలి. ఉన్న అప్పులను తీర్చడమెలా అన్నది పక్కన పెట్టి కొత్త అప్పులు చేయడమెలా అన్నదానిపైనా పాలకులు దృష్టి పెట్టడం దారుణం కాక మరొటి కాదు. పాలన అంటే పంచిపెట్టడం కాదని గుర్తించాలి. నగదు బదిలీలతో ప్రజలను మచ్చిక చేసుకుని ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ అధికారాన్ని గుప్పిట్లో ఉంచుకుని చేస్తున్న యత్నాలు విరమించుకోవాలి. ఉచిత పథకాలపై నెత్తీనోరు మొత్తుకుంటున్నా ఇద్దరు సిఎంలు వాటిని ఆపాలని ప్రయత్నించడం లేదు సరికదా అదేదో మహత్కార్యం చేసినట్లుగా ప్రకటనలు చేస్తున్నారు. ఇంకా ఆలస్యం చేయకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉచిత పథకాలపై కత్తెర వేయాలి. డబ్బుల పంపిణీని ఆపాలి. మరీ ముఖ్యంగా దుబారా పథకాలపై సమీక్షించాలి. ఇబ్బడి ముబ్బడిగా పోటీపడి కొనసాగిస్తున్న ఉచిత పథకాలను రద్దు చేయాలి. రైతుబంధు, రైతుల రుణ మాఫీలు, ఉచిత్ గొర్రెల పథకం, దళితబంధు వంటి పథకాల కారణంగా తెలంగాన అప్పుల్లో కూరుకుపోయింది. వీటిగురించి గొప్పలు చెప్పడం మానుకోవాలి. పథకాలు ఎంతమంచివైనా అర్హులకు సాయం అందించడంలో తప్పు లేదు. కానీ దుబారా పథకాలను కొనసాగిస్తే ప్రజలు ఊరికే వచ్చిన వాటిని తింటారు. తరవాత తిట్టడానికి కూడా వెనకాడరు. విపక్షాలు కూడా ఈ పథకాలపై చర్చించి దుబారాను అరికట్టాలని కోరాలి. లేకుంటే వారు కూడా ఇందుకు బాధ్యతులు కాగలరు. రూపాయికి కిలో సన్న బియ్యం, ఉచిత విద్యుత్, రైతుభరోసా, ఉచిత బస్సు వంటి పథకాలు ఇలా ఒక్కోటి చెప్పుకుంటూ పోతే..ఒక్కో పథకంలో ఎంతమంది పేదలు, అందులో అర్హులు ఉన్నారో లెక్క గట్టాలి. ప్రచారార్భాటాలు కాకుండా ప్రజలు తమంతగా తాము బాగుపడ్డామని చెప్పగలిగినప్పుడే సుపరి పాలన అందించిన వారం అవుతాం. 78 ఏళ్ల స్వాతంత్ర్యం తరవాత కూడా ఇంకా పేదలు అంటూ పాలన చేయడం సరికాదు. ప్రజల కష్టాలను కొంతయినా తగ్గించగలిగే నిర్ణయాలు మాత్రమే కావాలి. ప్రజలకు నేరుగా డబ్బులు పందేరం అన్నది వారిని సోమరులను తయారు చేసే ప్రయత్నం మాత్రమే కాగలదు. బంగారు పళ్లెంలో అన్నం పెట్టాలని ఎవరూ కోరుకోవడం లేదు. అన్నం తినగలిగేలా, గౌరవంగా బతికేలా వారి జీవితాలకు అడ్డం పడకుండా నిర్ణయాలు తీసకుంటే అదే మేలు. అప్పుడే ప్రజలు స్వాగతిస్తారు. ఎసి గదుల్లో కూర్చుని నిర్ణయాలు చేయడం..అవి ప్రజలకు చేరుతున్నాయో లేదో గమనించకపోవడం కాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే విధంగా చేసేందుకు అవసరమైన కఠిన నిర్ణయాలు తీసుకుంటే మంచిది. అంతేగానీ కులాలు,మతాలు పేరుతో విభజించి పథకాలు అమలు చేయడం సరికాదు.

# జనాభా పెరుగుదలకు ఏదీ ముకుతాడు?



న్యూఢిల్లీ,ప్రపంచ జనాభా 2025లో 8.2 బిలియన్లను దాటడంతో వనరులు, పర్యావరణం, సామాజిక, -ఆర్థిక స్థిరత్వంపై మానవ విస్తరణ ప్రభావం ఇంతకు ముందెన్నడూ లేనంతగా స్పష్టంగా కనిపిస్తున్నది. ప్రతి సంవత్సరం జులై మాసంలో జరుపుకునే ప్రపంచ జనాభా దినోత్సవం, ఈ సవాళ్లను గుర్తు చేస్తూ, విధాన నిర్ణేతలు, ప్రభుత్వాలు, వ్యక్తులు స్థిరమైన అభివృద్ధి, లింగ సమానత్వం, అవసరమైన ఆరోగ్య సంరక్షణ సేవలను పొందే దిశగా కృషి చేయాలని కోరుతోంది. ప్రపంచ జనాభా చారిత్రాత్మక గరిష్ట స్థాయికి చేరుకుంది. 2025 నాటికి 8.2 బిలియన్లను అధిగమించింది. ఈ సంఖ్య సుమారు 71 మిలియన్ల మంది వార్షిక పెరుగుదలను ప్రతిబింబిస్తుంది. ఇది మునుపటి సంవత్సరంతో పోలిస్తే 0.89% వృద్ధి రేటును సూచిస్తుంది.గత దశాబ్దాల కంటే ఈ వృద్ధి నెమ్మదిగా ఉన్నప్పటికీ, ప్రపంచం ఇప్పటికీ పట్టణీకరణ, వనరుల వినియోగం, పర్యావరణ ప్రభావం, ఆర్థిక అసమానతలకు సంబంధించిన సవాళ్లను ఎదుర్కొంటోంది. నానాటికీ పెరుగుతున్న జనాభా, దాని ద్వారా తలెత్తే దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు, జనాభా పెరుగుదల సమస్యలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగించేందుకు ఏటా జులై 11వ తేదీన ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1987 జులై 11వ తేదీన ప్రపంచ జనాభా ఐదు బిలియన్లకు చేరుకున్న (డే ఆఫ్ ఫైవ్ బిలియన్)రోజున పురస్కరించుకొని జనాభా పెరుగుదల గురించి ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అలా క్లిష్టమైనటువంటి జనాభా సమస్యలపై దృష్టిని ఆకర్షించడానికి ఐక్యరాజ్యసమితి ప్రపంచ జనాభా దినోత్సవాన్ని 1989లో ప్రారంభించింది.అప్పటినుండి ఇప్పటివరకు ప్రతి సంవత్సరం జూలై 11వ తేదీన జనాభా దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతున్నది. జనాభా పెరుగుదల కేవలం సంఖ్యల గురించి కాదు. ఇది మానవహక్కులు, లింగ సమానత్వం, ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత, వాతావరణ స్థితిస్థాపకత, ప్రపంచ వనరుల బాధ్యతాయుతమైన ఉపయోగం గురించి కూడా. ఆర్థిక వృద్ధిని పర్యావరణ పరిరక్షణ, మానవ శ్రేయస్సుతో సమతుల్యం చేసే వినూత్న పరిష్కారాలను కనుగొనడానికి ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు, మేధావులు, పరిశోధకులు, సంఘాలు కలిసి పనిచేయాలి. అంతేకాకుండా జనాభా ధోరణులను స్థిరీకరించడంలో మహిళా సాధికారత, పునరుత్పత్తి హక్కులు కీలకపాత్ర పోషిస్తాయి.అధిక సాంద్రత కలిగిన జనాభాను నిర్వహించడానికి సాంకేతిక పురోగతి, స్మార్ట్ అర్బన్ ప్లానింగ్ కూడా చాలా అవసరం. లేకపోతే అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇప్పటికే జనాభాకు సరిపడా ఆహారం దొరకక ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. దీన్ని అందరూ కూడా దృష్టిలో ఉంచుకోవాలి. వచ్చే ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకొని పిల్లల్ని కనాలి, వారికి మంచి విద్యను అందించడమే కాకుండా, పౌష్టిక విలువలు ఉన్నటువంటి ఆహారాన్ని కూడా అందించాలి. 2025 ప్రపంచ జనాభా దినోత్సవం థీమ్‌ను చూసినట్లయితే భవిష్యత్తు కోసం ఒక దార్శనిక దృష్టి అనే నినాదంతో ప్రతి వ్యక్తికీ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండి, వారి హక్కులు గౌరవించబడి, స్థిరమైన అభివృద్ధి సాధించబడుతుంది.అలాగే కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, పేదరికం, తల్లి ఆరోగ్యం, మానవ హక్కులు వంటి వివిధ జనాభా సమస్యలపై ప్రజల అవగాహన పెంచడం ప్రపంచ జనాభా దినోత్సవం లక్ష్యం. జనాభా పెరుగుదల ఎక్కువైతే అంటే ఆహారం, నీరు, గృహనిర్మాణం, శక్తి, ఆరోగ్య సంరక్షణ, రవాణా, మరిన్నింటికి డిమాండ్ పెరుగుతుంది. వాటి వినియోగం అంతా పర్యావరణ క్షీణతకు, ఘర్షణలను పెంచడానికి, మహమ్మారి వంటి పెద్ద ఎత్తున విపత్తుల ప్రమాదాన్ని పెంచుతుంది. జనాభాను నియంత్రించడానికి జనాభా పెరుగుదల వల్ల కలిగే సమస్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి.విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణం, ఆర్థిక వ్యవస్థపై జనాభా పెరుగుదల ప్రభావం గురించి వివరించాలి. జనాభా నియంత్రణకు సంబంధించిన బిల్లులను రూపొందించి, వాటిని అమలు చేయాలి. అయితే, బిల్లులు రూపొందించేటప్పుడు, ప్రజల హక్కులు, మతపరమైన, సామాజిక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వం కూడా ఈ ప్రాథమిక సమస్య అయిన జనాభా గురించి ఆలోచించడం లేదు. 20వ శతాబ్దం మొదట ప్రపంచ జనాభా 160 కోట్లు. ఈ రోజు ఒక శతాబ్దం తరువాత మనం 720 కోట్ల జనాభా. 2050 నాటికి 960 కోట్ల జనాభా అవ్వవచ్చని అంచనా వేస్తున్నారు. ఇది కేవలం బాధ్యత రహితమైన పునరుత్పత్తి.భారతదేశంలో 1947 సంవత్సరంలో మన జనాభా 33 కోట్లు. ఇవ్వాళ 120 కోట్లు, ఎన్ని చెట్లు పెంచినా, ఎన్ని చట్టాలు చేసినా, ఎటువంటి సాంకేతికతను తెచ్చినా జనాభా నియంత్రణ లేనిదే పరిష్కారం లేదు. జనాభా నియంత్రణ చేయకుండా, పర్యావరణ, భూమి లేదా నీరు పరిరక్షణ గురించి మాట్లాడడం వల్ల ఏమీ జరగదు. ప్రస్తుత సైన్స్ సాంకేతికత ప్రతి మనిషినీ అతిగా క్రియాశీలకంగా మార్చింది. మానవుని క్రియాశీలతను ఆపలేం, అలా చేస్తే మానవాళి ఆకాంక్షలకు అడ్డుకట్ట వేసినట్లు అవుతుంది. మనం కేవలం జనాభా నియంత్రించడం మాత్రమే చేయగలం. అందరి సమష్టి కృషితోనే ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి జనాభా పెరుగుదలను అరికట్టవచ్చు.

# టార్గెట్ మోడీ? ..మోదీని తప్పించాలనే...ఆర్ఎస్ఎస్ పట్టుసాధిస్తోందా?



హైదరాబాద్,ఆర్ ఎస్ ఎస్ మోదీని టార్గెట్ చేసిందా? ప్రధాని పదవి నుంచి స్వచ్ఛందంగా తప్పుకునే విధంగా పావులు కదుపుతుందా? అన్న సందేహాలు సర్వత్రా వెలువడుతున్నాయి. కేంద్రంలో వరుసగా రెండు సార్లు బీజేపీ అధికారంలోకి రావడంతో కేవలం మోదీ ప్రభావంతోటే సాధ్యమైందన్న ప్రచారం జరిగింది. పార్టీ నాయకులు కూడా పార్టీ కంటే మోదీ జపం చేయడంమొదలు పెట్టారు.. బీజేపీకి ఆర్ ఎస్ ఎస్ అవసరం లేదన్న తీరుగా వ్యవహరించారు. దీంతో 2024 ఎన్నికల నాటికి ఆర్ ఎస్ ఎస్ కు బీజేపీకి మధ్య గ్యాప్ పెరిగిందన్నఅభిప్రాయం సర్వత్రా ఏర్పడింది. దీని ప్రభావం ఎన్నికల ఫలితాలపై పడింది.చావు తప్పి కన్ను లొట్టపోయిందన్న తీరుగా బొటాబొటిగా మిత్రపక్షాలను కలుపుకొని మూడవ దఫా అధికార పగ్గాలుచేపట్టింది. అయితే ముఖ్యంగా మోదీపై ఆగ్రహంతో ఉన్న ఆర్ ఎస్ ఎస్ అవకాశం దొరికినప్పుడల్లా తన అసంతృప్తిని బయట పెట్టింది. ఇందులో భాగంగానే ఆర్ ఎస్ ఎస్ చీఫ్ భాగవత్ చేసిన వ్యాఖ్యలను అర్థంచేసుకోవాల్సి ఉంటుందని దేశ రాజకీయాలను అతి దగ్గరగా పరిశీలిస్తున్న సీనియర్ జర్నలిస్ట్ ఒకరు అన్నారు.

### చెక్ పెట్టనున్ననిబంధన

నరేంద్ర మోదీ బీజేపీ పార్లమెంటరీ పార్టీ పగ్గాలు చేపట్టిన తరువాతనేక మంది సీనియర్లను వయసు నిబంధన పేరుతో పక్కన పెట్టారు. తిరిగి అదే నిబంధనతో మోదీకి చెక్ పెట్టాలని ఆర్ ఎస్ ఎస్ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. నిబంధన ఏదైనా పార్టీలో అందరికీ ఒకే తీరుగా ఉంటుందని, మనుషులను బట్టి హోదాలను బట్టి మారదని అంటున్నారు. సైద్ధాంతిక ప్రాతిపదిక ఉన్న ఆర్ ఎస్ ఎస్, బీజేపీలలో ఎవరికైనా ఒకే రకమైన నిబంధన ఉంటుందని చెపుతున్నారు. అందులో భాగంగానే రాజకీయ నాయకులకు 75 ఏళ్ల వయస్సు రాగానే తప్పుకోవాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలను చూడాలని చెపుతున్నారు రాజకీయ పరిశీలకులు.

### మోహన్ భాగవత్ ఏమన్నారంటే?

75 ఏళ్ల వయస్సు వచ్చిందంటే శాలువా కప్పించుకుని బాధ్యతల నుంచి తప్పుకుని మరొకరికి అవకాశం ఇవ్వాల్సిన సమయం వచ్చిందని అర్థం చేసుకోవాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త మోర్పంత్ పింగ్లీకి అంకితం చేసిన పుస్తకావిష్కరణ సభ నాగ్ పూర్ లో జరిగింది.ఈ సభలో పింగ్లీ వాఖ్యలు భాగవత్ నోటి నుంచి వెలువడడం రాజకీయ వర్గాలలో చర్చకు దారితీసింది.

### మోదీని తప్పించాలనే

ఈ ఏడాది సెప్టెంబర్ 17తో నరేంద్ర మోదీ వయస్సు 75 ఏళ్లు. దీంతో నరేంద్ర మోదీ కూడా రిటైర్మెంట్ అవుతారా అనే చర్చ తెరమీదికి వచ్చింది. మోదీతో పాటు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ కూడా ఇదే బాటలో పయనిస్తారా అనే చర్చ కూడా ఉంది. ఈ ఏడాది సెప్టెంబర్ 11 తో భాగవత్ వయస్సు కూడా 75 ఏళ్లకు చేరనుంది. దీంతో భాగవత్, మోదీ తమ తమ స్థానాల నుంచి తప్పుకుంటారా అనేది ప్రస్తుతం చర్చకు కారణమైంది. విదేశీ పర్యటనలో ఉన్న మోదీకి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ 75 ఏళ్లకు రిటైర్మెంట్ అంశాన్ని ప్రస్తావించి మంచి స్వాగతాన్ని పలుకుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి జైరాం రమేశ్ అన్నారు. అంతేకాదు భాగవత్ కు కూడా ఈ ఏడాది సెప్టెంబర్ 11 నాటికి 75 ఏళ్లు నిండుతాయనే విషయాన్ని మోదీ గుర్తు చేయాలని జైరామ్ రమేశ్ ఆ పోస్టులో చెప్పారు. ఒకే బాణం%ॊ% రెండు లక్ష్యాలు అంటూ ఈ పోస్టుకు కామెంట్ పెట్టారు.బీజేపీ సీనియర్లు అద్వాణీ, మురళీ మనోహర్ జోషీ వంటివారిని వయస్సు నిబంధనతో టికెట్లు నిరాకరించిన మోదీ%ॊ% ఇప్పుడు తనకు ఈ నిబంధనను వర్తింపజేసుకుంటారా అని శివసేన ఉద్ధవ్ ఠాక్రే నాయకుడు సంజయ్ రౌత్ ప్రశ్నించారు. భాగవత్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం మోదీ టార్గెట్ గా చర్చకు కారణమయ్యాయి. మోదీని తప్పించాలనే ఉద్దేశంతో భాగవత్ ఈ వ్యాఖ్యలు చేశారని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. అందుకే మోదీ పేరును ప్రస్తావించకుండా భాగవత్ జాగ్రత్తపడ్డారనేది విపక్షాల మాట. అయితే భాగవత్ వ్యాఖ్యలకు ప్రతిపక్షాలు వక్రీకరిస్తున్నాయని బీజేపీ కొట్టిపారేస్తోంది.

### సీనియర్లకు టికెట్టు నిరాకరణ

75 ఏళ్లు నిండిన పార్టీ సీనియర్లకు బీజేపీ టికెట్లు ఇవ్వలేదు. ఇదే నిబంధన కింద మాజీ కేంద్ర మంత్రులు అద్వాణీ, మురళీ మనోహర్ జోషీ, జశ్వంత్ సింగ్ లను పార్టీ పక్కన పెట్టింది. 75 ఏళ్లు నిండినందునే పార్టీ సీనియర్లు కొందరికి టికెట్లు ఇవ్వలేదని 2019లో ఓ ఇంటర్వ్యూలో అమిత్ షా ప్రకటించారు. అయితే ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కొన్ని రాష్ట్రాల్లో ఈ నిబంధనను పక్కన పెట్టారు. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పను బీజేపీ పార్లమెంటరీ బోర్డులోకి తీసుకున్నారు. పార్టీ అవసరాల రీత్యా ఈ నిబంధనను పక్కన పెట్టారనేది రాజకీయ విశ్లేషకుల మాట. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ ఎంపికలో అప్పట్లో అద్వాణీది కీలకపాత్ర అని చెబుతారు. గోధ్రా అల్లర్ల ఘటన తర్వాత మోదీకి అద్వాణీ అండగా నిలిచారనేది అప్పట్లో ప్రచారంలో ఉండింది. అలాంటి అద్వాణీకి మాత్రం ఈ విషయంలో మినహాయింపు లభించలేదు.

### దూరం పెరగడానికి కారణాలివే

బీజేపీలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై ఆర్ఎస్ఎస్ కొంతకాలంగా అసంతృప్తితో ఉందనే ప్రచారం కూడా తెరమీదికి వచ్చింది. మహారాష్ట్రలో ఎన్సీపీతో జతకట్టడంపై ఆర్ఎస్ఎస్ అధికారిక పత్రిక ఆర్గనైజర్ లో అభ్యంతరం వ్యక్తం చేస్తూ వ్యాసం రాశారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో 400 ఎంపీ సీట్లు టార్గెట్ గా బీజేపీ ప్రచారం చేసింది. అయితే బీజేపీకి ఆశించిన ఫలితాలు రాలేదు. ఎన్డీఏలోని భాగస్వామ్యపక్షమైన టీడీపీ, నితీష్ కుమార్ పార్టీ జేడీయూ మద్దతుతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి వచ్చింది. దీనికి రకరకాల కారణాలున్నాయి. అయితే ఈ ఎన్నికల్లో బీజేపీకి ఆర్ఎస్ఎస్ క్షేత్రస్థాయిలో సహకరించలేదనే వాదన కూడా ఉంది. ఎన్నికలకు ముందు ఓ జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలు ఆర్ఎస్ఎస్ లో అసంతృప్తికి కారణమనే వాదన కూడా ఉంది. గతంలోని బీజేపీకి ఇప్పటి బీజేపీకి తేడా ఉంది. వాజ్ పేయ్ హయంతో పోల్చుకుంటే ఇప్పుడు పార్టీ బలపడింది. అప్పట్లో ఆర్ఎస్ఎస్ పై ఆధారపడినా ఇప్పుడు పరిస్థితి మారిందని ఆయన ఆ ఇంటర్వ్యూలో చెప్పారు. దీంతో పాటు ఇతరత్రా కారణాలు కూడా క్షేత్రస్థాయిలో ఆర్ఎస్ఎస్ శ్రేణులు బీజేపీ కోసం పనిచేయలేదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఉత్తర్ ప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాల్లో దీని ప్రభావం ఎన్నికల ఫలితాల్లో కన్పించిందనేది వారి వాదన.

### ప్రసన్నం చేసుకునే పనిలో మోదీ

మోదీ మూడోసారి అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఆర్ఎస్ఎస్, బీజేపీ మధ్య సంబంధాల పునరుద్దరణ కోసం ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఈ దిశగా రెండువైపులా చర్చలు సాగాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది మార్చిలో ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించారు. ప్రధాని హోదాలో ఆర్ఎస్ఎస్ కార్యాలయాన్ని ఆయన తొలిసారిగా సందర్శించారు. బీజేపీ ,ఆర్ఎస్ఎస్ మధ్య గ్యాప్ ను పూడ్చే ప్రక్రియలో భాగంగానే మోదీ నాగ్ పూర్ లో సంఘ్ ప్రధాన కార్యాలయానికి వెళ్లారనే ప్రచారం కూడా సాగింది. తమ మధ్య బంధంలో ఎలాంటి ఇబ్బంది లేదని సంఘ్ కార్యాలయానికి వెళ్లడం ద్వారా మోదీ సంకేతం ఇచ్చినట్లైంది.

# అహంకారం తగ్గని వైకాపా నేతలు

అమరావతి, గత ఎన్నికల ఫలితాల్లో జగన్ మోహన్ రెడ్డి నిరంకుశ, అవినీతి పరిపాలనకు ప్రజలు గుణపాఠం చెప్పి.. ప్రతిపక్ష హోదా దక్కకుండా చేసినా వైకాపా నేతలకు బుద్ధి రాలేదనిఏపీఎస్ ఆర్టీసీ కొనకళ్ళ నారాయణ అన్నారు. స్వాతంత్య్రం వచ్చిన తరువాత కనీవినీ ఎరుగని రీతిలో కూటమి ప్రభుత్వం అత్యంత అధిక మెజార్టీతో అధికారాన్ని ఇచ్చారు. మీరు ఓడిపోయిన అవమానంతో, అసూయతో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారు. రప్పా.. రప్పా.. చీకట్లో కన్ను కొడితే పని అయిపోవాలి.. తలలు లేచిపోవాలి.. అని పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు దేనికి సంకేతం.. అని ప్రశ్నించారు. మాజీ మంత్రిగా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న పేర్ని నాని ప్రజాస్వామ్యన్ని రక్షించేవిధంగా మాట్లాడాలి. కానీ, హింసను ప్రేరేపించే విధంగా మాట్లాడటం దారుణం అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో అంబేద్కర్ రాజ్యాంగం నడుస్తుంది.. సీఎం చంద్రబాబు సారధ్యంలో ఉన్న కూటమి ప్రభుత్వంలో హింసను ఎట్టిపరిస్థితుల్లో ప్రొత్సహించరు. గత ప్రభుత్వంలో జగన్ రెడ్డి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తు.. అవినీతి మయంగా, ఆరాచకంగా మార్చారు. గతంలో టీడీపీ నాయకులను, కార్యకర్తలపై దాడులు చేసి, హత్యలు చేశారు. అది మీ సంస్కృతి.. ప్రజలు మీకు తగిన గుణపాఠం చెప్పారు. పేర్ని నాని మీద బందరులో ఎన్ని అభియోగాలు ఉన్నాయి.. ఎన్ని నేరాలు చేశావ్.. గోడౌన్ లో రేషన్ బియ్యం ఎక్కడికి పోయాయి. రంగనాయకుల గుడి 10 ఎకరాల స్థలానికి ఏమి సమాధానం చెప్తావ్.. బీచ్ పక్కన ఉన్న గుడిసెలను తగలబెట్టారు.. దానికి ఏమి సమాధానం చెప్తావ్.. దమ్ము ఉంటే అక్కడికి వెళ్లి మాట్లాడాలని అన్నారు. పేర్ని నాని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తమ్మిన వారి సత్రానికి చెందిన 1000 గజాల స్థలాన్ని అక్రమించుకున్నారు. పేర్ని నాని తండ్రి పేర్ని విష్ణుమూర్తి ఏనాడూ కూడా హింసను ప్రోత్సహించే విధంగా మాట్లాడలేదు. కానీ, నీ ప్రవర్తన ధోరణీ మీ నాయకుడు మెచ్చుకునే విధంగా ఉంది. హింసను ప్రోత్సాహించి.. పరుష పదజాలంతో వేరే పార్టీ వారిని తిడితే మీ నాయకుడికి ఆనందం.. జగన్ రెడ్డి ఓదార్పు యాత్ర పేరుతో పాదయాత్ర చేస్తే అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్కడ ఏ విధమైన అవంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తే.. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రం యువనాయకులు నారా లోకేష్ యువగళం పేరుతో పాదయాత్ర చేస్తే అడుగు అడుగునా ఆటంకాలు సృష్టించారు. మేము అధికారంలోకి వస్తే గతంలో కంటే మంచి పాలన సాగిమని చెప్పలే కానీ, బెదిరింపులు మాటలతో ప్రజలను భయభ్రాంతులను గురి చేయడం వల్ల వచ్చే లాభం ఏమి ఉండదని అన్నారు.

# ఇరాన్‌లో బాలికపై అత్యాచారం

టెహ్రాన్, ఓ బాలికను హత్యాచారం చేసిన కేసులో దోషిగా తేలిన వ్యక్తికి ఇరాన్ అధికారులు బహిరంగంగా మరణశిక్ష విధించారు. ఈమేరకు స్థానిక మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. వాటి ప్రకారం .. బుకాన్‌కు చెందిన ఓ బాలికను అత్యాచారం చేసిన కేసులో ఓ వ్యక్తి దోషిగా తేలాడు. అతడికి బహిరంగంగా మరణశిక్ష విధించాలని భాధిత కుటు-ంబ సభ్యులు , ప్రజల నుంచి పెద్ద ఎత్తున అభ్యర్థనలు వచ్చాయి. మార్చిలో అతడికి మరణశిక్ష ఖరారు కాగా, సుప్రీం కోర్టు కూడా దాన్ని సమర్థించింది.భావోద్వేగాలతో ముడిపడిన కేసు కాబట్టి కఠినశిక్షపై నిర్ణయం తీసుకున్నామని న్యాయమూర్తి పేర్కొన్నారు. బాధిత కుటు-ంబ సభ్యుల కోరిక మేరకు శిక్షను విధిస్తున్నట్టు- చెబుతూ తాజాగా దాన్ని అమలు చేశారు. ఇరాన్‌లో బహిరంగంగా మరణశిక్షలు విధించడం సాధారణమే. హత్య, అత్యాచారం వంటి తీవ్రత ఎక్కవ ఉన్న కేసుల్లో ఇలాంటి కఠినమైన శిక్షలను అమలు చేస్తారు. మానవహక్కుల సంఘాల ప్రకారం.. ప్రపంచంలో ఎక్కువ మరణశిక్షలు అమలు చేసే దేశాల్లో ఇరాన్ రెండోస్థానంలో ఉంది. మొదటి స్థానంలో చైనా ఉంది.

# ఐదు మున్సిపాలిటీలకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు

న్యూఢిల్లీ, కేంద్ర ప్రభుత్వం పలు రాష్ట్రాల్లోని నగరాలకు వివిధ కేటగిరీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు ప్రకటించింది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని అయిదు మున్సిపల్ కార్పొరేషన్లకు అవార్డులు దక్కాయి. విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, గుంటూరు నగరాలు ఆ పురస్కారాలు దక్కించుకున్నాయి. జాతీయ స్థాయిలో స్పెషల్ కేటగిరీ మినిస్టీరియల్ అవార్డును విశాఖ నగరం సొంతం చేసుకుంది. రాష్ట్ర స్థాయిలో మినిస్టీరియల్ అవార్డుకు రాజమండ్రి ఎంపికైంది.స్వచ్ఛ సూపర్‌లీగ్ సిటీస్ విభాగంలో విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరాలు ఎంపికయ్యాయి. రాష్ట్రంలోని ప్రధాన నగరాలు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులకు ఎంపిక కావడంపై ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల కారణంగానే ఈ అవార్డులు దక్కాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కృషి చేసిన అధికారులు, పారిశుద్ధ సిబ్బంది, సహకరించిన ప్రజలకు పట్టాభి అభినందనలు తెలిపారు.

# ప్లాస్టిక్ వద్దు.. పేపర్ బ్యాగే ముద్దు

న్యూఢిల్లీ,భూమిలో త్వరగా కరిగిపోయే పేపర్ బ్యాగ్‌ల పేరు మీద ఓ దినోత్సవాన్ని జరిపే పరిస్థితులు ఈ రోజుల్లో ఉన్నాయి. కారణం కాలుష్యం. ఇందుకు సంబంధించి కొన్ని కఠిన వాస్తవాలు తెలుసుకోవాలి. ప్రతి సంవత్సరం జులై 12న ప్రపంచ దేశాలన్నీ పేపర్ బ్యాగ్ దినోత్సవాన్ని జరుపు తున్నాయి. తెల్లారితే చాలు... మనం ఏ షాపుకి వెళ్లినా... కూరగాయల కోసం, టిఫిన్ల కోసం వెళ్లినా ..ప్లాస్టిక్ లేదా పాలిథిన్ కవర్లలోనే ఐటెమ్స్ ఇస్తుంటారు. వాడి పారేశాక... అవి భూమిలో కరగవు. కొన్ని వేలు, లక్షల సంవత్సరాలు కరగకుండా అలాగే ఉంటాయి. ఫలితంగా సముద్రాలు, నదులు, డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగిపోతున్నాయి. చివరకు సముద్రాల్లో చేపల కంటే ప్లాస్టిక్ కవర్లే ఎక్కువనే రోజులు వచ్చేలా ఉన్నాయి. ఈ పాలిథిన్ కవర్ల బదులు మనమే పేపర్ బ్యాగులు వాడితే బాగుంటుందనే ప్రచారం మొదలైంది. వీటి వల్ల పర్యావరణానికి కాలుష్యం పెద్దగా ఉండదు. పైగా... ఇవి భూమిలో త్వరగా కరిగిపోతాయి. ప్రతి సంవత్సరం ఈ రోజున స్కూళ్లు, కాలేజీలు, యూనివర్శిటీల్లో పేపర్ బ్యాగుల వాడకం పై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే పాలిథిన్ కవర్ల వల్ల కలిగే నష్టాలను వివరిస్తారు. అలాగే కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ప్రజలను పేపర్ బ్యాగులు వాడమని ప్రోత్సహిస్తాయి. ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి.అమెరికాకి చెందిన ఫ్రాన్సిస్ వోల్లే మొదటిసారి పేపర్ బ్యాగ్ యంత్రాన్ని తయారుచేశారు. ఓ రకమైన కలపతో ఈ బ్యాగులను తయారుచేస్తారు. 1871లో మార్గరెట్ నైట్... మరో యంత్రం చేశారు. అది ఫ్లాట్ బాటమ్ పేపర్ బ్యాగ్స్ తయారుచేసింది. ఆమెను గ్రాసరీ బ్యాగ్ మాతృమూర్తిగా పిలుస్తారు. ఇలా కాలక్రమంలో రకరకాల యంత్రాలు వచ్చి... మంచి పేపర్ బ్యాగులు తయారవుతున్నాయి.పేపర్ బ్యాగులు పర్యావరణానికి హాని చెయ్యవు. వీటిని వాడటం చాలా ఈజీ.

# తిరుమల ఆలయ పవిత్రతను దెబ్బతీసే కుట్ర

తిరుపతి,టీటీడీలో వెయ్యి మంది అన్యమత ఉద్యోగులు ఉన్నారంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను వైకాపా నేత, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తప్పుబట్టారు. వెయ్యిమంది అన్యమతస్థులు ఉన్నారని అనడం శుద్ధ అబద్ధమని అన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యల వెనుక తిరుమల ఆలయ పవిత్రతను దెబ్బతీసే కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. టిటిడి లెక్కల ప్రకారమే 20 మంది ఉన్నారని తెలిపారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీలో ఉన్న వెయ్యి మంది అన్యమత ఉద్యోగస్తులను తొలగించాలని బండి సంజయ్ హెచ్చరించారని.. పూర్వ అధ్యక్షుడిగా బండి సంజయ్ వ్యాఖ్యలను తాను ఆక్షేపిస్తున్నట్లు తెలిపారు. బండి సంజయ్ కామెంట్స్ శ్రీవారి ఆలయంపై దాడిలా ఉందని మండిపడ్డారు. దర్శనానికి వచ్చి దర్శనం చేసుకుని పోకుండా.. ఇంత పెద్ద బండ టీటీడీపై వేయటం సబబుగా లేదన్నారు. టీటీడీలో 22 మంది అన్యమత ఉద్యోగులను గుర్తించామని ఆరు నెలల క్రితం టీటీడీ బోర్డు ప్రకటించిందని.. కానీ ఇప్పుడు బండి సంజయ్ మాత్రం వెయ్యి మందికి పైగా ఉన్నారని చెబుతున్నారని భూమన అన్నారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ తన వద్ద ఆధారాలు ఉంటే తెలపాలని భూమన సవాల్ చేశారు. దాదాపు 20 శాతం మంది అన్యమత ఉద్యోగులు టీటీడీలో ఉన్నట్లు బండి సంజయ్ వ్యాఖ్యల సారాంశమని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం బండి సంజయ్ వ్యాఖ్యలను సమర్థిస్తుందా అని ప్రశ్నించారు. బండి సంజయ్ హెచ్చరిక చేసి 24 గంటలు అయ్యిందని.. ఇప్పటి దాకా టీ-టీ-డీ చైర్మన్, ఈఓ, ప్రభుత్వం, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ కానీ దీన్ని ఖండించలేదన్నారు. వీరంతా బండి సంజయ్‌కి లొంగిపోయారా? ఆయన చెప్పింది నిజమని సమర్థిస్తున్నారా అని నిలదీశారు. కేంద్ర మంత్రి ఆరోపణలపై వివరణ ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. పాలక మండలిని, టీటీడీ ఉద్యోగులను తీవ్రంగా అవమాన పరిచేలా బండి సంజయ్ వ్యాఖ్యలు ఉన్నాయని భూమన కరుణాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# టిటిడిలో అన్యమతస్థులు ఉన్నమాట నిజమే

తిరుమల,టీటీడీలో అన్యమతస్థులు ఉండేది వాస్తవమని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. టీటీడీలో వెయ్యి మంది అన్యమతస్థులు ఉన్నారన్న కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై విచారణ కొనసాగుతోందన్నారు. అయితే ఎవరున్నా వారిని తొలగిస్తామని అన్నారు. రాష్ట్రంలో అర్చక నిరుద్యోగులుగా ఉన్న అర్చక స్వాములకు భృతి ఇవ్వాలని మేనిఫెస్టోలో ఉందని దేవాదాయశాఖ మంత్రి అన్నారు. ఆ మేరకు రాష్ట్రంలో 590 మంది వేద పండితులు నిరుద్యోగులుగా ఉన్నారని.. వారికి 3 వేల రూపాయలు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రంలోని పునర్నిర్మాణంలో ఉన్న ఆలయాలకు రూ.147 కోట్లు విడుదల కాకుండా నిలిచిపోయాయన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా మరో రూ.11 కోట్ల నిధులు మిగతా ఆలయాలకు రావాల్సి ఉందని తెలిపారు. వీటన్నింటిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని బోర్డు, అధికారులు చెప్పారని మంత్రి వెల్లడించారు. తిరుమలలో టీటీడీ, దేవాదాయశాఖ సంయుక్త సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. టీటీడీ చైర్మన్, ఈవో, అదనపు ఈవో, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి సమీక్ష చేశామన్నారు. గతంలో సీఎం చంద్రబాబు దగ్గర జరిగిన సమావేశంలో ఆలయాలకు సంబంధించిన కొన్ని సమస్యలు ముందుకు వచ్చాయని.. వాటిని చర్చించుకొని రండి అని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. దేవాదాయ చట్టం ప్రకారం 9 శాతం కామన్ గుడ్ ఫండ్ టీటీడీ నుంచి తీసుకోవాల్సిన నిబంధనలు ఉన్నాయని చెప్పారు. గతంలో 5 శాతం ఉన్న దానిని 9 శాతానికి పెంచామని తెలిపారు. విజయవాడ దుర్గ గుడికి వెళ్లేందుకు మరో రోడ్డు మార్గం వేసేందుకు టీటీడీ సహకారం కావాలని కోరారు. టీటీడీ కాలేజీ, పాఠశాలల్లో ఉన్న 192 పోస్టులను ఒప్పంద లెక్చరర్‌లతో భర్తీ చేసేందుకు చర్చించినట్లు- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. కాగా.. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన తొలి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీటీడీ ఈవో, అదనపు ఈవో, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నిధుల విడుదల, శ్రీవాణి ట్రస్ట్ నిధులతో నిర్మిస్తున్న ఆలయాల వివరాలు, ఆలయాల పునరుద్ధరణ మరియు పరిరక్షణ, వాటి పురోగతి తదితర ముఖ్యమైన అంశాలపై విస్తృతంగా చర్చించారు.


# ములుగు కుంపటి...

వరంగల్ : ములుగులో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజుకున్న రాజకీయ కుంపటి ఇప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లాను చుట్టేస్తోంది. ప్రజానిరసన పేరుతో మంత్రి సీతక్క లక్ష్యంగా బీఆర్ఎస్ ముందస్తు ప్రణాళిక ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాయకులు, వారి అనుచరులు ములుగుకు తరలివెళ్ళేందుకు యత్నించిన విషయం తెలిసిందే. ములుగుకు తరలివెళ్ళిన వారిలో కొందరిని పోలీసులు అరెస్టు చేశారు. సీతక్క పై నిరసనను బీఆర్ఎస్ నాయకులు ఉమ్మడి వరంగల్ జిల్లాకు విస్తరింపచేశారు. ఈ అంశంపై మంత్రి సీతక్క మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు తీరుపై ముఖ్యంగా ఆ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ పై నిప్పులు చెరిగారు. తనను విమర్శించాలంటే ములుగు ప్రజలను సమీకరించాల్సి ఉండగా ఇతర నియోజకవర్గాల నుంచి మాజీ ఎమ్మెల్యేలు, వారి అనుచరులు తరలివచ్చి బలప్రదర్శనకు దిగడం సిగ్గుచేటన్నారు. నిరసన తర్వాత కూడా రాజకీయ వేడితగ్గకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య విమర్శల వేడికొనసాగుతోంది.

రాజకీయ విమర్శలు, వ్యక్తిగత ఆరోపణలు

ములుగులో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ప్రారంభమైన రాజకీయ విమర్శలు, వ్యక్తిగత ఆరోపణలకు, నిరసనకు దారితీసింది. ములుగు కేంద్రంగా బలప్రదర్శనకు సిద్ధమై బాహాబాహికి తలపడ్డారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. బీఆర్ఎస్ ములుగులో నిరసన చేపట్టిన రోజే జిల్లాలో మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వర్ రావుల పర్యటన చేపట్టారు. దీంతో పోలీసులు బీఆర్ఎస్ నాయకులను కట్టడి చేశారు. ఇది జీర్ణించుకోలేని ఆ పార్టీ నాయకులు పోలీసుల తీరుపై విరుచుకపడ్డారు. బీఆరెఎస్ నిరసనలతో పాటు తన పై చేసిన విమర్శల పై మంత్రి సీతక్క తీవ్రంగా ప్రతిస్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేటీఆర్ పైన తీవ్ర విమర్శలు చేశారు. సీతక్క తనదైన శైలిలో శాపనార్ధాలు పెట్టారు. ఆదివాసీ బిడ్డనైన నాకు మంత్రి పదవి వస్తే తట్టుకోలేక మీ కల్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని, తన పైన అన్యాయంగా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి సీతక్క కడుపమండి బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ పైన తీవ్ర

# కృత్రిమ మేధతో భవితకు ధీమా




న్యూఢిల్లీ,కృత్రిమ మేధ (ఎఐ) అనేది యంత్రాలు మానవులవలే ఆలోచించి, మానవ సామర్థ్యాలను అనుకరించే పనులను చేయగల సాంకేతికత. ఈ సాంకేతికత భారీ డేటాను సేకరించి, గణిత నమూనాలు లేదా అల్గారిథమ్‌ల ద్వారా నమూనాలను గుర్తించి, ఊహలు చేసేందుకు శిక్షణ పొందుతుంది. శిక్షణ తర్వాత, ఈ అల్గారిథమ్‌లు వివిధ అనువర్తనాల్లో ఉపయోగించబడతాయి. కొత్త డేటా నుండి నేర్చుకుంటూ, చిత్రాన్ని గుర్తించటం, భాషా ప్రాసెసింగ్, డేటా విశ్లేషణ వంటి సంక్లిష్ట పనులను మరింత ఖచ్చితత్వంతో నిర్వహిస్తాయి. ఎఐలో ప్రధాన రకాలు ఉన్నాయి. మెషిన్ లెర్నింగ్ డేటా నుండి నేర్చుకుని నిర్దిష్ట పనులను చేస్తుంది. దాని ఖచ్చితత్వం అనుభవంతోపాటు పెరుగుతుంది. డీప్‌లెర్నింగ్ మానవ మెదడును పోలి ఉంటుంది.అది న్యూరల్ నెట్‌వర్క్‌ల ద్వారా సంక్లిష్ట నమూనాలను గుర్తిస్తుంది. వైద్య చిత్రాల విశ్లేషణ, ఉపగ్రహ చిత్రాల్లో కదలికలు, ప్రకంపనలను గుర్తించడం వంటి పనులకు ఉపయోగపడుతుంది. న్యాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (ఎన్ఎల్‌పి) మానవ భాషను అర్థం చేసుకుని, సంభాషించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. జనరేటివ్ ఎఐ టెక్ట్, చిత్రాలు, వీడియోల వంటి కొత్త కంటెంట్‌ను సృష్టిస్తుంది. కళ, వినోదం, మార్కెటింగ్, సాఫ్ట్‌వేర్ మొదలైన అనేక రంగాల్లో, వాటి అభివృద్ధిలో అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. ఎఐ ఏజెంట్లు స్వయంచాలకంగా (తమకు తామే స్వయంగా) నిర్ణయాలు తీసుకుంటాయి. ఏజెంటిక్ ఎఐ బహుళ ఏజెంట్ల సమన్వయంతో సంక్లిష్ట పనులను నిర్వహిస్తుంది. ఉదాహరణకు, పరిశోధన లేదా సాఫ్ట్‌వేర్ సమస్యల వంటివి పరిష్కరిస్తుంది. ఎఐ నాలుగు వర్గాలుగా విభజించబడింది: రియాక్టివ్ ఎఐ సమాచారం ఆధారంగా ఫలితాలను ఉత్పత్తి చేస్తుంది. లిమిటెడ్ మెమరీ ఎఐ గత డేటాను ఉపయోగించి ఊహలు చేస్తుంది.థియరీ ఆఫ్ మైండ్ ఎఐ మానవ భావోద్వేగాలను అర్థం చేసుకునే సైద్ధాంతిక సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. సెల్ఫ్- అవేర్ ఎఐ యంత్రాలకు మానవ స్థాయి స్పృహను ఇవ్వగల సైద్ధాంతిక దశను కలిగి ఉంటుంది. ప్రస్తుతం, ఎఐ సమస్యలను పరిష్కరించడం, పరిష్కారాలను అభివృద్ధి చేయడం, ప్రశ్నలకు సమాధానమివ్వడం, సూచనలను అందించడం వంటివి చేస్తోంది. 'డ్రాప్‌బాక్స్', 'చాట్‌జిపిటి', 'సౌండ్‌రా' వంటి సాధనాలు మన సమయాన్ని ఎంతగానో ఆదా చేస్తాయి. ఉత్పాదకతను పెంచుతాయి. స్మార్ట్ ఫోన్ అసిస్టెంట్లు, ఇ-కామర్స్ సిఫారసు వ్యవస్థలు, స్వయంచాలక వాహనాలు, మోసం గుర్తింపు, ఆరోగ్య సంరక్షణ, వాతావరణ పరిశోధనలో ఎఐ ఉపయోగించబడుతోంది. ఎఐ కొత్త విద్యుత్ అని ఆండ్రూ ఎన్జీ పేర్కొన్నారు. గూగుల్ మ్యాప్స్, టెక్ట్స్ ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్ వంటి రోజువారీ సాధనాల్లో ఎఐ ఇప్పటికే ఉంది.ఎఐ నైపుణ్యాల డిమాండ్ గత దశాబ్దంలో నాలుగు రెట్లు పెరిగింది. ప్రస్తుతం ఎఐ సంబంధిత ఉద్యోగులకు 11 శాతం ఎక్కువ వేతనం లభిస్తున్నాయి. సమాచారం, ఆర్థిక శాఖ, పరిపాలన రంగాలలో ప్రత్యేకంగా ఎఐని ఉపయోగిస్తున్నారు. అనేక ఇతర రంగాలలో ఎఐ వాడకం నానాటికీ అనూహ్యంగా పెరుగుతోంది. ఎఐ డేటా ఎంట్రీ వంటి పునరావృత (రొటీన్) పనులను ఆటోమేట్‌గా వేగంగా పని చేస్తుంది. భారీ డేటాను సైతం విశ్లేషించి, తార్కిక నిర్ణయాలకు సహాయపడుతుంది. చాట్ బాట్‌లు కస్టమర్ డిమాండ్ మేరకు స్ట్రీమ్‌లైన్ చేస్తాయి. జెపి మోర్గాన్ ఒమ్ని ఎఐ ప్లాట్‌ఫారమ్ ఆర్థిక అంతర్ దృష్టులను అందించి, ఖర్చులను తగ్గిస్తుంది. 2028 నాటికి 90 శాతం యజమానులు ఎఐని అమలు చేయాలని ప్లాన్ చేస్తున్నారు.ఎఐ ఆటోమేషన్ 25 శాతం ఉద్యోగాలను భర్తీ చేయవచ్చు. కానీ సైబర్ సెక్యూరిటీ, డేటా విశ్లేషణ వంటి కొత్త రంగాల్లో అవకాశాలను మరింత ఎక్కువగా సృష్టించే అవకాశం ఉంది. ఆర్థికం, ఇ-కామర్స్, ఆరోగ్య సంరక్షణ, విద్య, బీమా, న్యాయ సేవలు ఇలా అనేక రంగాల్లో ఎఐ వాడకం విస్తరించుకుంటూపోతుంది. గ్రంథాలయలలో ఎఐ వాడకం ఇంకా ప్రారంభ దశలో ఉన్నప్పటికీ, జ్ఞాన ప్రాప్యతను విస్తరిస్తుంది. చాట్‌బాట్‌లు కస్టమర్ ను గుర్తించటం, నిర్ధారణ చేసుకోవటం, డేటా పర్యవేక్షణ, ఖర్చు ఆదాలో సహాయపడుతునతున్నాయి. కానీ ప్రస్తుతం అసమర్థమైన స్పందనల కారణంగా మానవ లైబ్రరీయన్‌లను పూర్తిగా రీప్లేస్ చేయలేవు. మనిషికి బహు విధాలుగా ఉపయోగపడే సాధనంగా చెప్పచ్చు.ఎఐ సర్క్యులేషన్, కాటలాగింగ్ వంటి పనులను ఆటోమేట్‌గా చేస్తుంది, 'టెక్ట్ టు -స్పీచ్' ద్వారా సౌలభ్యతను మెరుగుపరుస్తుంది, డేటా విశ్లేషణ, విషయ సేకరణ, విషయ నిర్వహణ, మెటా డేటా ఖచ్చితత్వాన్ని పెంచుతుంది. లైబ్రరీయన్‌లు ఎఐని గురించిన అవగాహను పెంచుకోవాలి. దానికి సంబంధించిన జ్ఞానాన్ని లోతుగా పొందాలి. అందుకు వర్క్‌షాప్‌లు, శిక్షణా తరగతులు ఎక్కువగా నిర్వహించాలి. ఎఐ పై ప్రపంచ వ్యాప్తంగా అనేక విధాలుగా పరిశోధనలు జరుగుతున్నాయి. వాటిలో అప్ డేట్ వర్షన్ల గురించి లైబ్రేరియన్స్ ఎప్పటికపుడు తెలుసుకుంటూ ఉండాలి. ఎఐని బాధ్యతాయుతగా ఉపయోగించాలి.గమనించాల్సిన విషయాలు: ఎఐ ఎల్లప్పుడూ ఖచ్చితమైనది కాదు. ఎఐ పై మానవ తనిఖీ, పర్యవేక్షణ అవసరం. న్యాయ శాస్త్రంలో, పరిశోధనా రంగాలలో దీనిని జాగ్రత్తగా ఉపయోగించాలి. ఎందుకంటే ఇది కొన్ని తప్పుడు సమాచారాన్ని ఉత్పత్తి చేయవచ్చు. దీనికి వేగంగా సమాచారాన్ని తీసుకుని విశేషణ చేస్తుంది. అయితే అది విషయాన్ని నేర్చుకునే సమయంలో తప్పు సమాచారం ఇస్తే దానినే యథాతథంగా నేర్చుకొని తప్పు సమాధానమే మనకు ఇస్తుంది. రఫ్ డ్రాఫ్ట్‌లు, రాయడంలో లోపాల తగ్గిస్తుంది. పదేపదే చేయవలసిన రొటీన్ పునరావృత పనులకు ఎఐ ఉపయోగపడుతుంది. కానీ, అది ప్రస్తుత పరిస్థితుల్లో భావోద్వేగాలను వ్యక్తీకరించలేదు. భవిష్యత్తులో చెప్పలేం.అందుకే దీనికి మానవ స్పర్శ అవసరం. ఎఐ సాక్షరత పాఠశాల పాఠ్యాంశాల్లో భాగం కావాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఇది భవిష్యత్తు కెరీర్‌లకు ఉపయోగపడుతుంది. సామాజిక అభివృద్ధికి అది కీలకం కానుంది. ఎఐని గురించి ప్రతి ఒక్కరూ క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. దీనిని సమర్థవంతంగా ఉపయోగించడానికి నిరంతర శిక్షణ, వృత్తిపరమైన అభివృద్ధి అవసరం ఉంటుంది. లైబ్రరీలు, విద్యా సంస్థలు ఎఐని సమీకరించడం ద్వారా డిజిటల్ సామర్థ్యాన్ని,ఆవిష్కరణలను పెంపొందించగలవు. ఎఐ మన జీవితాలను, పని వాతావరణాన్ని, విద్యను వేగంగా మార్చివేస్తోంది. అలాగే దీనిని బాధ్యతాయుతంగా ఉపయోగించడం ద్వారా మనం భవిష్యత్తును మరింత సమర్థవంతంగా, సమగ్రంగా రూపొందించగలం.

# తెల్ల కల్లు కల్లోలం.. ప్రాణాల కంటే కమీషన్ లకే ప్రాధాన్యం



హైదరాబాద్,హైదరాబాద్ కూకట్‌పల్లిలో కల్తీ కల్లు దందా బయటపడింది. అయిదు దుకాణాల్లోని కల్లు నమూనాలను పరీక్షించగా, నాలుగు చోట్ల అల్ప్రాజోలం కలిపినట్లు అధికారులు తేల్చారు. అక్రమాలు జరుగుతున్నా పట్టించుకోలేదని బాలానగర్ ఆబ్కారీ సీఐపై సస్పెన్షన్ వేటు పడగా, మరికొందరిపైనా ఉన్నతాధికారుల విచారణ జరుగుతోంది. ఆబ్కారీ శాఖ అధికారుల డొల్ల తనిఖీలతోనే నిరుపేదలు మరణించారని విమర్శలు వినిపిస్తున్నాయి.సాధారణంగా చెట్ల నుంచి సేకరించిన కల్లును మాత్రమే లైసెన్స్ పొందిన దుకాణాల్లో విక్రయించాల్సి ఉన్నా, ఆ నిబంధనలను పట్టించుకోకుండా నిర్వాహకులు కల్తీ కల్లు దందాకు పాల్పడుతున్నారు. తెలుపురంగు కోసం క్రీము, నురుగు కోసం కరక్కాయ పొడి, మత్తు కోసం అల్ప్రాజోలం, క్లోరోహైడ్రేట్ వంటి ప్రమాదకర రసాయనాలు కలుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. అడ్డగోలు వసూళ్లతో ఆబ్కారీ సిబ్బంది మౌనం వహించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.తాటి చెట్లు లేకున్నా కల్లు..రాష్ట్రంలో టీఎఫ్టీ (టాడీ ఫర్ ట్యాపర్స్), టీసీఎస్ (టాడీ ట్యాపర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ)లు తెల్ల కల్లు అమ్మేందుకు ప్రభుత్వం లైసెన్సులు ఇస్తుంది. తాటి, ఈత చెట్ల నుంచి తీసిన కల్లును సొసైటీల ద్వారా విక్రయించుకోవచ్చు. ఆయా టీఎఫ్టీలు, టీసీఎస్లకు వాటి పరిధిలో తాటి వనాలు, ఈత వనాల కేటాయింపు ఉంటుంది. ఊళ్లల్లో ఉండే టీఎఫ్టీలకు కావాల్సినన్ని చెట్లు అందుబాటులో ఉండటంతో కల్తీ పెద్దగా జరగడం లేదు.అదే నగరాల్లో మాత్రం తాటి చెట్లు సరిపడా లేక దుకాణాల నిర్వాహకులు కల్తీకి తెరతీస్తున్నారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఈ కల్తీ దందా ఎక్కువగా నడుస్తోంది. కొందరు అల్ప్రాజోలం, క్లోరల్ హైడ్రేట్, డైజో ఫామ్ కలిపి కల్లు తయారు చేస్తుండగా.. మరికొందరు ఏకంగా రసాయనాలతో కృత్రిమ (సింథటిక్) కల్లును తయారు చేస్తున్నారు.కిలోకు రూ.10-15 లక్షల ధర అల్ప్రాజోలం ఎక్కువగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని ఫార్మా కంపెనీల్లో తయారవుతుండగా, మహారాష్ట్రలోనూ కొన్ని ముఠాలు తయారు చేసి తెలంగాణకు సరఫరా చేస్తున్నాయి. కిలో ?10-15 లక్షలకు ఇక్కడి దుకాణదారులకు అమ్ముతున్నట్టు తెలుస్తోంది.10 గ్రాముల అల్ప్రాజోలంతో ఏకంగా 1200 సీసాల తెల్ల కల్లు తయారు చేస్తూ.. ఇక్కడి నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో కామారెడ్డి జిల్లాలో కల్తీ కల్లు తాగి పలువురు అస్వస్థతకు గురి కాగా, టీజీఏఎన్బీ దర్యాప్తు చేసి ఈ భారీ రాకెట్ను ఛేదించింది. మహారాష్ట్రలో అల్ప్రాజోలం తయారు చేస్తున్న పరిశ్రమలను గుర్తించి వాటిని సీజ్ చేయించారు.

శాంపిల్స్ తీసుకునేటప్పుడే కమీషన్..

ప్రతి కల్లు దుకాణంలో నియమ నిబంధనల ప్రకారం రోజువారీగా కల్లు నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపి పరీక్షించాలి. ఫలితాలను బట్టి కల్లు దుకాణాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి. కానీ ఆబ్కారీ సిబ్బంది అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. నమూనాల సేకరణ నుంచే మామూళ్ల దందా మొదలవుతున్నట్లు తెలుస్తోంది. రోజూ ఆయా ఠాణాల పరిధిలోని కల్లు దుకాణాలకు వెళ్లి సిబ్బంది నమూనాలు సేకరించేటప్పుడే కమీషన్లు అందుకుంటున్నట్లు సమాచారం. కల్తీ జరగని లేదా అల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాలు కలపని నమూనాలనే సిబ్బంది సేకరిస్తున్నారని ఆరోపణలున్నాయి.

ప్రతి నెలా కమీషన్లు ..

ప్రతి నెలా ఒక్కో కల్లు దుకాణం నుంచి స్థానిక ఆబ్కారీ ఠాణాకు కమీషన్లు వెళున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. తక్కువ గిరాకీ ఉండే దుకాణం నుంచి నెలకు కనిష్ఠంగా ?20 వేలు, ఎక్కువ గిరాకీ ఉంటే ఏకంగా ?లక్షకు పైగా కమీషన్ వెళ్తున్నట్లు సమాచారం. మద్యం పర్మిట్ రూములు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేయడం, పబ్బులు, ప్రైవేట్ ఈవెంట్ల నిర్వహణకు వసూళ్ల కంటే కల్లు దుకాణాల వద్ద అదనంగా వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రాంతాన్ని బట్టి ఈ వసూళ్ల దందా ?కోట్లలో ఉంటుందని సమాచారం.రాజేంద్రనగర్ పరిధిలో..రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని ఓ కల్లు దుకాణం భారీ వ్యాపారం చేస్తుంది. మెహిదీపట్నం, గుడిమల్కాపూర్, కార్వాన్, ఆసిఫ్‌నగర్, మైలార్‌దేవ్‌పల్లి వంటి ప్రాంతాల నుంచి వందలాది మంది అక్కడకి వచ్చి కల్లు తాగుతారు. ఇక్కడ పెద్ద మొత్తంలో కల్తీ దందా నడుస్తున్నందుకు నెలవారీగా సుమారు ?లక్షకు పైగా స్థానిక ఆబ్కారీ ఆఫీసర్లకు ముట్టజెప్తున్నట్టు తెలుస్తోంది.ఇది కేవలం స్టేషన్‌కు వెళ్లే కమీషన్ మాత్రమేనని, అధికారులకు మరో వాటా ప్రత్యేకంగా వెళ్తుందని కొందరు సిబ్బంది బహిరంగంగా చెబుతుండడం విశేషం.నెలవారీ మామూలుతోపాటు.. అదనంగామానసిక చికిత్సకు చెందిన ప్రముఖ ఆసుపత్రి ఉండే ప్రాంతంలో మామూళ్లు ఇచ్చేందుకు కల్లు దుకాణాల నిర్వాహకులే సిండికేట్‌గా మారారు. నాలుగైదు కల్లు దుకాణాల నిర్వాహకులంతా కలిపి స్థానిక ఆబ్కారీ స్టేషన్‌కు ?50 వేల నుంచి ?75 వేల మధ్య మామూళ్లు ముట్టజెబుతున్నట్టు తెలుస్తోంది. అవి కాకుండా, సిబ్బందిని చూసుకోవాల్సి ఉంటుంది.అడపా దడపా కల్లు దుకాణాల్లో నేరాలు జరగడం, మత్తు ఎక్కువై కుప్పకూలడం వంటి ఘటనలు జరిగితే అదనంగా చెల్లించుకోవాల్సి ఉంటుందని సమాచారం.కల్లు దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు.. ఆబ్కారీ శాఖలో పాతుకుపోయిన అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో ఉన్నాతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి.పరిస్థితి ఇలాగే కొనసాగితే, అమాయక ప్రజలు కల్తీ కల్లు తాగి ప్రాణాలను కోల్పోయే పరిస్థితులు ఉత్పన్నం అవుతాయి. అయితే.. ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో అప్రమత్తమైన ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, అనుమతి లేకుండా నడుస్తున్న కల్లు కాంపౌండ్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగరంలోని మూడు బృందాలతో సోదాలు జరిపారు. శేర్లింగంపల్లి, మూసాపేట్, బాలానగర్, కైత్లాపూర్, ముషీరాబాద్, కాచిగూడలో ఉన్న కల్లు డిపోలపై దాడులు చేపట్టారు.ఇకమీదట కఠినచర్యలుంటయ్..శేర్లింగంపల్లిలోని సిద్దిక్ నగర్‌లో ఒక కల్లు కాంపౌండ్ అనుమతి లేకుండా నడుస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ బృందం గుర్తించింది.ఆ కాంపౌండ్‌ను సీజ్ చేయడంతో పాటు దుకాణ యజమానిపై కేసు నమోదు చేశారు. అన్ని కాంపౌండ్ల నుంచి శాంపిల్స్ సేకరించి నారాయణగూడలోని ల్యాబ్‌కు పంపించారు. కేవలం అధికారిక డిపోల నుంచి వచ్చే కల్లును మాత్రమే స్టోరేజ్ చేసి విక్రయించాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏ చిన్న తప్పుచేసినా, ఉపేక్షించమని, పట్టుబడితే లైసెన్స్ శాశ్వతంగా రద్దు చేస్తామని హెచ్చరించారు.

# శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జ్ వినుత సస్పెన్షన్

శ్రీకాళహస్తి,జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వినుతనుఆ పార్టీ అధిష్టానం బహిష్కరించింది. ఈ మేరకు మీడియాకు జనసేన అధిష్టానం శనివారం లేఖ విడుదల చేసింది. వినుత వ్యవహార శైలి జనసేన విధి విధానాలకి భిన్నంగా ఉండటంతో ఆమెని గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకి దూరంగా ఉంచినట్లు- జనసేన హై కమాండ్ తెలిపింది. ఆమెపై చెన్నైలో జరిగిన ఓ హత్య కేసు ఆరోపణలు పార్టీ దృష్టికి వచ్చాయని గుర్తుచేసింది. ఈ క్రమంలో వినుత కోటను పార్టీ నుంచి బహిష్కరించామని జనసేన హై కమాండ్ ప్రకటించింది. కోట వినుత డ్రైవర్ శ్రీనివాసులు అలియాస్ రాయుడు(24) చైన్నైలో దారుణ హత్యకి గురయ్యాడు. చెన్నై మిట్ రెడ్ హిల్స్ పరిసర ప్రాంతాల్లో రాయుడు మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులు పరిశీలించారు. వినుత డ్రైవర్ రాయుడు కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి రాయుడు నానమ్మ వచ్చింది. ఆమెని పోలీసులు విచారణ చేశారు. మూడు నెలలుగా రాయుడుకు వినుత కుటుంబ సభ్యులతో విభేదాలు ఉన్నాయని తెలిపింది. రాయుడు మృతికి వినుత కుటుంబ సభ్యులే కారణమని అనుమానం వ్యక్తం చేశారు. రాయుడు నానమ్మ ఫిర్యాదు మేరకు వినుత, ఆమె భర్త కోట చంద్రబాబు, వినుత తండ్రి భాస్కర్‌లని చెన్నై పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు పోలీసులు ఈ కేసుని ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు.ఈ క్మంలో జనసన ఆమెను పార్టీనుంచి సస్పెండ్ చేసింది.

# వైసిపి నేతల హింసారాజకీయ ప్రవృత్తి

అమరావతి,ప్రజాస్వామ్యాన్ని అంతం చేసేందుకు వైసీపీ శ్రేణులు కుట్రలు చేస్తున్నారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ విమర్శలు గుప్పించారు.'చీకట్లో కన్ను కొడితే.. తలలు నరికేయండి' అని కృష్ణా జిల్లా వైసీపీ అధ్యక్షులు పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తీవ్రంగా మండిపడ్డారు. చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం చేసి ప్రజల మన్ననలు పొందాలని పదేపదే చెప్తూ ఉంటారన్నారు. కానీ వైసీపీ వారు మాత్రం హత్యలు చేయండి.. తలలు నరకండని చెప్తున్నారంటే వారి పార్టీ ఆలోచనలు, నాయకుల మానసిక పరిస్థితి ఏ రకంగా ఉందో అర్థమవుతుందన్నారు. హింస, విధ్వంసం వైసీపీ పాలసీ అని పేర్నినాని వ్యాఖ్యల ద్వారా మరోసారి స్పష్టమైందని ఎమ్మెల్యే విమర్శించారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రజాప్రతినిధులు చేసే ప్రతీ పనిని ప్రజలు నిశితంగా గమనిస్తారన్నారు. తప్పు జరిగితే క్షమించను అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పదేపదే చెబుతున్నారని గుర్తు చేసిన ఎమ్మెల్యే.. వైసీపీ నేతలు మాత్రం విధ్వంసమే పరమావధిగా ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. రెంటపాళ్లలో వైసీపీ కార్యకర్త రప్పా.. రప్పా.. అని ప్లకార్డు పట్టుకుంటే.. మీడియా సమక్షంలో దానిని సమర్థించారంటే జగన్ రెడ్డి మానసిక పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతోందని ఎద్దేవా చేశారు. ఒక పార్టీ అధ్యక్షుడిగా, మాజీ సీఎంగా ప్రజాప్రతినిధులకు ఇచ్చే స్ఫూర్తి ఇదేనా అని జగన్ రెడ్డిని ఎమ్మెల్యే ప్రశ్నించారు. రప్పా.. రప్పా.. నరికేస్తాం.. అనేది వైసీపీ తీసుకువచ్చిన రాజారెడ్డి రాజ్యాంగమని విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలవుతోందని స్పష్టం చేశారు. రేషన్ బియ్యం, అక్రమ మైనింగ్, భూ దందా, అవినీతి సొమ్ముతో పేర్ని నాని విర్రవీగి వ్యవహరిస్తున్నారని.. ఎన్నికల ఫలితాలను గుర్తు చేసుకోవాలని హితవుపలికారు. గత ప్రభుత్వ పాలనలో బీచ్ రోడ్డులో పూరి గుడిసెలకు నిప్పు పెట్టడం, ప్రజా రక్షణ కోసం పని చేసే పోలీస్ స్టేషన్‌పై దాడి చేయడం అనేది నిజమా..? కాదా..? అని ప్రశ్నించారు. 'రప్పా.. రప్పా అని టీ-వీల ముందు కాదు.. మచిలీపట్నంలో నువ్వు అక్రమించిన వెయ్యి గజాల తమ్మిన వారి సత్రం దగ్గర కానీ, నువ్వు కబ్జా చేసిన కోటా జయరాం పొలం వద్ద కానీ, రంగనాయక స్వామి గుడి దగ్గరకు కానీ వెళ్తే అక్కడి స్థానికులు నీ రప్పా.. రప్పా.. సంగతి చెప్తారు' అంటూ బోడె ప్రసాద్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# మోడీకి ఎసరు?

న్యూఢిల్లీ,ప్రధాని నరేంద్రమోడీకి బీజేపీ మెంటార్ గా భావించే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఎసరు పెడుతోందా? బీజేపీలో, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో మోడీ వ్యక్తిపూజ పీక్స్ చేరిందని భావిస్తున్న ఆర్ఎస్ఎస్ ఆయన పదవి దిగిపోవాలని కోరుకుంటోందా? అంటే పరిశీలకులు ఔననే అంటున్నారు. ఇప్పటికే గుజరాత్ ముఖ్యమంత్రిగా నాలుగు సార్లు, ఆ తరువాత దేశ ప్రధానిగా వరుసగా మూడో సారి కొనసాగుతున్న ప్రధాని మోడీని ఆ పదవి నుంచి దిగిపోవాల్సిందేననీ, ఆ టైమ్ ఇచ్చేసిందనీ పరోక్షంగా ఆర్ఎస్ఎస్ గుర్తు చేస్తుండటం వెనుక ఉద్దేశం అదేనని అంటున్నారు. వచ్చే సెప్టెంబర్ తో ప్రధాని మోడీకి 75 ఏళ్లు వస్తాయి. ప్రధాని మోడీ హవా బీజేపీలో మొదలైన తరువాత ఆయనే 75 ఏళ్ల వయస్సు నిబంధనను తీసుకువచ్చారని చెప్పాలి. 75 సంవత్సరాలు వచ్చిన వారెవరూ పార్టీ, ప్రభుత్వ పదవులు నిర్వహించకుండా నిబంధన విధించారు. ఇప్పుడు మోడీ 75 సంవత్సరాల నిబంధన పరిధిలోకి వస్తున్నారు. ఇక్కడ వయస్సు నిబంధన విషయంలో మోడీకి మినహాయింపు ఇవ్వాలని బీజేపీ భావిస్తోంది. అయితే ఆర్ఎస్ఎస్ మాత్రం మోడీకి వయస్సు గురించి గుర్తు చేస్తూ వారసుడి అన్వేషణ అనివార్యం అని హెచ్చరిక లాంటి సూచన చేస్తోంది. ముఖ్యంగా ఆర్ ఎస్ ఎస్ చీఫ్ మోహన్‌భగవత్.. ఈ విషయంలో గట్టి పట్టుదలతో ఉన్నారని ఆర్ఎస్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా ఆయన వయస్సు విషయంలో చేసిన వ్యాఖ్యలు ప్రధాని మోడీకి ఓ హెచ్చరికేనని అంటున్నారు. స్థాయితో సంబంధం లేకుండా నాయకుడనే వారు ఎవరైనా సరే నిబంధనలు పాటించి తీరాలి. అలా పాటించకపోతే అసలు నిబంధనలు ఎందుకు? అంటూ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు మోడీ ప్రధానిగా కొనసాగే విషయంలో ఆయన విస్పష్టంగా తన అభ్యంతరాన్ని చెప్పినట్లుగానే ఉన్నాయి. 75 ఏళ్లు వచ్చిన తరువాత ఎవరైనా సరే తమ పదవులు త్యాగం చేయాల్సిందేనని మోహన్ భగవత్ కుండబద్దలు కొట్టారు. దీంతో నరేంద్ర మోడీ ప్రధాని పదవిలో కొనసాగడంపై దేశ వ్యాప్తంగా విస్తృతంగా చర్చ మొదలైంది. ఎందుకంటే ఈ ఏడాది సెప్టెంబర్ తో ఆయనకు 75 ఏళు వస్తాయి. ఈ క్రమంలో నిబంధనల మేరకు ప్రధాని పదవిని వదులు కోవాల్సి ఉంటుందని అంటున్నారు.ఇదేసమయంలో ఆర్ ఎస్ ఎస్ చీఫ్‌గా ఉన్న మోహన్‌భగవత్ కూడా అదే నెలలో పదవీ త్యాగం చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి ఆయన మోడీ కంటే కూడా.. ముందే 75వ వసంతంలోకి అడుగు పెట్టనున్నారు. దీంతో ముందు ఆయన రిజైన్ చేసి..కొత్తవారికి పగ్గాలు అప్పగించడం ఖాయంగా కనిపిస్తోంది. ఇదే జరిగితే.. ప్రధాని మోడీకి కూడా తాను తప్పుకుని కొత్త వారికి అవకాశం ఇవ్వాల్సిన అనివార్యత ఏర్పడుతుందని అంటున్నారు. కానీ.. బీజేపీని మూడుసార్లు వరుసగా అధికారంలోకి తెచ్చిన నాయకుడిగా మోడీ పదవి నుంచి తప్పుకోవడానికి బీజేపీ అంగీకరిస్తుందా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# ఎఫ్‌బీఐ చీఫ్ రాజీనామా అంటూ పుకార్లు.. మౌనం వీడిన కాష్ పటేల్



వాషింగ్టన్,ఎఫ్‌బీఐ చీఫ్ కాష్ పటేల్ రాజీనామా చేశారంటూ వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. జెఫ్రీ ఎప్‌స్టీన్‌పై దర్యాప్తును ముగించాలని న్యాయ శాఖ తీసుకున్న నిర్ణయంపై అంతర్గత ఉద్రిక్తతల నేపథ్యంలో ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ రాజీనామా చేయబోతున్నట్లు పుకార్లు వ్యాప్తి చెందాయి.అయితే రాజీనామా వార్తలపై మిండెన్‌లో జరిగిన ర్యాలీలో కాష్ పటేల్ మౌనం వీడారు. రాజీనామా వార్తలను ఆయన తోసిపుచ్చారు. జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసులో కొత్త విషయాలు ఏమీలేవని న్యాయశాఖ తేల్చింది. ఈ నేపథ్యంలోనే విమర్శలు వెల్లువెత్తాయి. కుట్ర సిద్ధాంతాలు నిజం కావని.. ఎప్పుడూ నిజం కావని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడికి సేవ చేయడం గౌరవంగా ఉందని.. ట్రంప్ పిలిచేంత వరకు ఆ పదవిలో కొనసాగుతానని తేల్చి చెప్పారు.ఎప్‌స్టీన్ ఫైల్స్ అనేది అమెరికాలో సంచలనం సృష్టించిన జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణానికి సంబంధించిన కీలక పత్రాల వ్యవహారం. ఈ ఫైల్స్‌లో ఎప్‌స్టీన్ కాంటాక్ట్ లిస్ట్, ఫ్లైట్ లాగ్‌లు, అతనికి వ్యతిరేకంగా సేకరించిన ఆధారాలు ఉన్నాయి. అయితే ఈ కేసులో ప్రముఖ రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, సెలబ్రిటీలు ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. ఎప్‌స్టీన్ ఫైల్స్ వ్యవహారాన్ని అమెరికా న్యాయ విభాగం.. ఎఫ్‌బీఐ కలిపి విచారిస్తోంది. అయితే ఈ కేసును అటార్నీ జనరల్ పామ్ బాండీకు అప్పగించినప్పటి నుంచి ఎఫ్‌బీఐ డిప్యూటీ డైరెక్టర్ డాన్ బోంగినో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఆయన సెలవులపై వెళ్లారు. అయితే ఆమె ఉండగా తాను తిరిగి విధుల్లోకి రాలేనని బోంగినో ఎఫ్ఐబీకి స్పష్టం చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ తరుణంలోనే కాష్ పటేల్ ఈ వ్యవహారంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బోంగినో గనుక రాజీనామా చేస్తే.. కాష్ తాను పదవి నుంచి వైదొలగాలని భావిస్తున్నారని మీడియా కథనాలు వచ్చాయి. తాజాగా ఆ వార్తలను ఖండించారు. తాను రాజీనామా చేయడం లేదని కాష్ పటేల్ స్పష్టం చేశారు.జెఫ్రీ ఎప్‌స్టీన్.. మైనర్లపై లైంగిక నేరాలకు సంబంధించిన ఆరోపణలతో అరెస్టు అయిన ఒక అమెరికన్ వ్యాపారవేత్త. అతను 2019లో జైల్లో మరణించాడు. అతని మరణం తర్వాత కేసు, దాని పరిణామాలపై దర్యాప్తులు జరిగాయి. ఈ దర్యాప్తుల్లో ఎప్‌స్టీన్ నేరాల యొక్క పరిధి.. జైలులో ఎలా మరణించాడనే దానిపై ప్రశ్నలు, కేసులో పాల్గొన్న ఇతర వ్యక్తులపై ఆరోపణలను పరిశోధించారు. ఎప్‌స్టీన్ మరణం ఆత్మహత్య అని వైద్య నివేదికలు కూడా నిర్ధారించాయి. కానీ అతని కుటుంబం మాత్రం హత్య చేశారని ఆరోపించింది. ఇక ఎఫ్‌బీఐ, న్యాయశాఖ దర్యాప్తులు కూడా ఆత్మహత్య అని నిర్ధారించాయి. తాజాగా ఈ కేసులో ఏమీలేదని దర్యాప్తును కూడా ముగించేశాయి.

# 'తీన్మార్' కొత్త పార్టీ.. సంచలన ప్రకటన



హైదరాబాద్,ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా ఉన్న చింతపండు నవీన్.. ఉరఫ్ తీన్మార్ మల్లన్న.. కొత్త పార్టీని స్థాపించనున్నట్టు సంచలన ప్రకటన చేశారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు. బీసీ సామాజిక వర్గం కోసమే పార్టీని స్థాపించనున్నట్టు ప్రకటించారు. అయితే.. పార్టీ పేరు.. ఎప్పుడు పెట్టేది మాత్రం ఆయన సస్పెన్సులో ఉంచారు. తాజాగా బీఆర్ ఎస్ నాయకురాలు.. కవిత.. బీసీ రిజర్వేషన్లపై చేసిన వ్యాఖ్యలు.. ఈ క్రమంలో ఆమెను కార్నర్ చేస్తూ.. తీన్మార్ మల్లన్న చేసిన సంచలన కామెంట్లతో తెలంగాణ రాజకీయాలు వేడెక్కాయి. తీన్మార్ మల్లన్న కార్యాలయంపై జాగృతి కార్యకర్తలు దాడి కూడా చేశారు.ఈ పరిణామాల క్రమంలో మీడియా ముందుకు వచ్చిన మల్లన్న.. రాష్ట్రంలో బీసీ సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతోందని తెలిపారు. బీసీ సామాజిక వర్గం అనేక సమస్యలు ఎదుర్కొంటోందని చెప్పారు. వారి తరఫున పోరాటం చేసేందుకు, రాజ్యాధికా రం దక్కేలా వారిని ముందుండి నడిపించేందుకు తనవంతు పాత్ర పోషిస్తానన్నారు. ఈ క్రమంలోనే కొత్త పార్టీని స్థాపించనున్నట్టు మల్లన్న చెప్పారు. బీసీలు ఐక్యంగా ఉంటే.. ప్రస్తుతం ఉన్న రాష్ట్ర రాజకీయాలను మార్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. బీసీ రిజర్వేషన్లు ఇచ్చి.. చేతులు దులుపుకోవడం కాదని.. వారికి రాజ్యాధికారం దక్కేలా కృషి చేయాల్సి ఉందని పరోక్షంగా కాంగ్రెస్ పార్టీపై ఆయన విమర్శలు గుప్పించారు.ఇదిలావుంటే.. గత 2023 ఎన్నికలకు ముందు కూడా.. తీన్మార్ మల్లన్న ఇలానే వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కొత్త పార్టీ పెడు తున్నట్టు ప్రకటించారు. ఈ క్రమంలో తెలంగాణ నిర్మాణ పార్టీ(టీఎన్‌పీ)ని ఆయన ప్రకటించారు. దీనిలో యువతకు ముఖ్యంగా బీసీ, ఎస్సీలకు ప్రాదాన్యం ఉంటుందన్నారు. విద్యార్థులను సమైక్యం చేసి రాజకీయాల్లోకి తీసుకురానున్నట్టు తెలిపారు. 2023 రాష్ట్ర ఎన్నికల్లోనూ.. 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ పోటీ చేస్తామన్నారు. అయితే.. ఆ ప్రతిపాదన అప్పట్లో కాయితాలకే పరిమితం అయింది. యువతకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా.. కుటుంబ రాజకీయాలకు రాష్ట్రంలో చెక్ పెడతామని కూడా అప్పట్లో ప్రకటించారు.కానీ, గత ఏడాది జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున మల్లన్న పోటీ చేసి విజయం దక్కించుకున్నారు. ఆ తర్వాత.. కొన్నాళ్లు బాగానే ఉన్నా.. సీఎం రేవంత్ సహా.. ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేయడం ప్రారంభించారు. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్న కుల గణనను తీవ్రంగా తప్పుబట్టారు. దీనిని రెడ్డి సామాజిక వర్గం కోసమే చేపట్టారంటూ.. వ్యాఖ్యలు చేశారు. ఇది పార్టీలోనే కాదు.. ప్రభుత్వంలోనూ ఆగ్రహం కలిగించింది. దీంతో మల్లన్నపై చర్యలకు పట్టుబడుతూ.. సీనియర్లు పార్టీకి ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి నుంచి మల్లన్నను పార్టీకి దూరంగా ఉంచారు.

# మోడీని తప్పిస్తే.. కమలం వాడిపోదా..!



న్యూఢిల్లీ,ఒకవైపు మోడీకి ప్రత్యామ్నాయ నేతను ఆర్‌ఎస్‌ఎస్ వెదికే పనిలో ఉందనే వార్తలు వస్తూ ఉన్నాయ. మరోవైపు ఇదే పరిణామాల మధ్యన ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఇచ్చిన స్టేట్ మెంట్ పై వార్తలను సమర్థించేలా ఉంది. రాజకీయ నాయకులు 75 యేళ్ల వయసుకు రిటైర్మెంట్ తీసుకోవాలంటూ మోహన్ భగవత్ వ్యాఖ్యానించారు! స్వయంగా ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ ఈ ప్రకటన చేశారు. దీంతో.. ఇది మోడీకి ఆర్‌ఎస్‌ఎస్ నుంచి అందుతున్న బహిరంగ సూచన అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతూ ఉన్నాయి.ప్రత్యేకించి ఈ డెబ్బై ఐదేళ్ల రిటైర్మెంట్ లేదా తప్పుకోవడం అనేది గత కొన్నాళ్లుగా బీజేపీలో అమల్లో ఉన్న అనధికారిక నియమం లాంటిదే! ఇదే కారణాన్ని చూపి మోడీ తొలి కేబినెట్లో కొంతమంది మంత్రులు చేత రాజీనామాలు కూడా చేయించారు! అప్పటికి దశాబ్దం ప్రతిపక్ష వాసం తర్వాత కేబినెట్లో చోటు సంపాదించిన వారిని కూడా 75 యేళ్లు దాటాయంటూ రిటైర్మెంట్ ఇప్పించారు. ఇంకా అనేక మంది సీనియర్లకు వివిధ రాజకీయ అవకాశాలను ఇవ్వడానికి అప్పుడు నిరాకరించారు! అదేమంటే.. వారి వయసు 75 సంవత్సరాలు లేదా అంతకన్నా ఎక్కువ అని, ఆ వయసు లో పెద్ద బాధ్యతలు అక్కర్లేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ వారిని పక్కన పెట్టారు! ప్రధానిగా మోడీ, బీజేపీ జాతీయాధ్యక్షుడిగా అమిత్ షా ఉన్నప్పుడు ఈ డెబ్బై ఐదేళ్ల వయసు నియమాన్ని చర్చలోకి తీసుకొచ్చారు. సీనియర్లను ఇంటికి పంపించడమో, రాజకీయ పునరావసం తరహా పదవులను ఇచ్చి పక్కన పెట్టడమో చేశారు!ఇదంతా దాదాపు పదేళ్ల కిందట జరిగిన సంగతి. మరి ఇప్పుడు మోడీ స్వయంగా 75కు దగ్గరపడుతున్నారు. మరో రెండు నెలల్లో ఆయన 75 యేళ్ల వయసును పూర్తి చేసుకుంటూ ఉన్నారు. అయితే మోడీకి ఈ నియమం వర్తించదంటూ బీజేపీ నేతలు గట్టిగానే చెప్పారు ఇప్పటికే! స్వయంగా అమిత్ షానే ఈ ప్రకటన చేశారు. మోడీకి 75 యేళ్ల వయసు రిటైర్మెంట్ వర్తించదని, ఈ టర్మ్ పూర్తయ్యే వరకూ మోడీనే ప్రధానిగా ఉంటారంటూ అమిత్ షా స్పష్టం చేశారు 2029 వరకూ మోడీనే ప్రధాని అంటూ కేంద్ర హెూంశాఖా అధ్యక్షుడు ప్రకటించారు ఇది వరకే! అయితే ఇప్పుడు మోహన్ భగవత్ వ్యాఖ్యల సందేశం ఏమిటనే చర్చ జరుగుతూ ఉంది. ఈ ప్రకటనను మోడీ వ్యతిరేకులు బాగానే వాడుకుంటూ ఉన్నారు.ప్రత్యేకించి కొందరు కాంగ్రెస్ నేతలు మోడీకి ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడి సందేశాన్ని చేరవేస్తున్నట్టుగా మాట్లాడుతున్నారు. గతంలో ఇదే నియమాన్ని మోడీ ప్రవచించి, ఇతరుల విషయంలో అమలు చేశారని, ఇప్పుడు మోడీ ఆ నియమాన్ని పాటించరా.. అంటూ కాంగ్రెస్ నేతలు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. దేన్నైనా ప్రవచించి, ఆ తర్వాత దాన్ని తనే పాటించకపోవడం అనేది మంచి పద్ధతి కాదంటూ వారు వ్యాఖ్యానిస్తూ ఉన్నారు. పరోక్షంగా, ప్రత్యక్షంగా మోడీని వారు దెప్పి పొడుస్తూ ఉన్నారు!అమిత్ షా ప్రకటనను బట్టి చూస్తే.. మోడీకి 75 యేళ్ల వయసు రిటైర్మెంట్ అనేది జరిగే పని కాదు. అలాంటి అవసరం లేదు. బీజేపీ సీనియర్లకు ఆ నియమం వర్తింపజేస్తే చేశారు కానీ, మోడీకి మాత్రం అలాంటి నియమాలు ఉండవు! అద్వానీ, మురళీ మనోహర్ జోషీ, యడియూరప్ప ఇతరాత్ర సీనియర్ నేతలకు వర్తించిన అలాంటి నియమం మోడీకి మాత్రం వర్తించదు. అలాంటివి మోడీకి చెల్లుబాటు కావు. అయితే ఇప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడు ఎవరిని ఉద్దేశించి ఆ వ్యాఖ్య చేశారు అనేది ఆసక్తిదాయకమైన అంశం. మరి బీజేపీలో అమలైన నియమం, బీజేపీ మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు చేసిన సూచన.. మోడీకి వర్తించదా అనేది చర్చనీయాంశమే!అయితే మోడీకి వయసు రీత్యా రిటైర్మెంట్ ఇస్తే.. అప్పుడు కమలం పువ్వు పరిస్థితి ఏమవుతుంది అనేది మరో చర్చ! గత దశాబ్దకాలంగా బీజేపీలో మోడీ పేరు మార్మోగాల్సిందే తప్ప మరో మాటే లేదు! మోడీనే ప్రధానమంత్రి, మోడీనే బీజేపీ పాలిత రాష్ట్రాలకు ముఖ్యమంత్రి అన్నట్టుగా రాజకీయం సాగింది. మరి అలాంటిది మోడీకి రిటైర్మెంట్ ఇచ్చేస్తే అప్పుడు బీజేపీని ఊహించుకోవడం కూడా కష్టం! అయితే వ్యక్తిపూజకు వ్యతిరేకం అనేది ఆర్ఎస్ఎస్ పెట్టుకున్న అంతర్గత నియమం! కాంగ్రెస్ రాజకీయాల్లో వ్యక్తిపూజ ఉంటుందని, వ్యక్తుల కన్నా వ్యవస్థ ముఖ్యమని సంఘ్ చెబుతుంది. వ్యవస్థాగతమైన పునాదులున్నాయి కాబట్టి.. మోడీ ఇమేజ్ మీద కాకుండా సిద్ధాంత బలంతో బీజేపీ బలం కొనసాగుతుందనేది సంఘ్ నమ్మకం కావొచ్చు!

# మాట-చేత.. రెండింటిలోనూ ఈ రెడ్లు టాపే.. !



అమరావతి,రాజకీయాల్లో రెడ్డి సామాజిక వర్గానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. వైసీపీలో అయినా.. టీడీపీలో అయినా.. రెడ్లు టాప్‌లోనే ఉంటారు. ఉన్నారు కూడా. మరీ ముఖ్యంగా నెల్లూరు జిల్లాకు చెందిన రెడ్లు అయితే.. మాట, చేత రెండిట్లోనూ దూకుడుగానే ఉంటున్నారు. వైసీపీ హయాం నుంచి టీడీపీ హయాం వరకు కూడా రెడ్డి నేతలు.. దూకుడుగానే వ్యవహరిస్తున్నారు. ఇంకోరకంగా చెప్పాలంటే.. వైసీపీ హయాంలో కంటే కూడా.. టీడీపీ హయాంలోనే రెడ్డి నాయకులు దూకుడుగా వ్యవహరించడం కనిపిస్తోంది.నెల్లూరు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో రెడ్డి నాయకులు టీడీపీ తరఫున గత ఎన్నికల్లో విజయం దక్కించుకున్నారు. ఈ నలుగురు కూడా అటు మాటల్లోనూ.. ఇటు ప్రభుత్వ పథకాలు, పనులకు సంబం ధించిన చేతల్లోనూ దూకుడుగానే ఉండడం గమనార్హం. ఉదాహరణకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చం ద్రమోహన్‌రెడ్డి మాట మెత్తగా ఉన్నా.. పదునెక్కువ అనే పేరు తెచ్చుకున్నారు. ప్రతిపక్ష నాయకులపైనా పార్టీపైనా ఆయన దూకుడుగానే వ్యవహరిస్తున్నారు.అయితే.. సోమిరెడ్డి సుదీర్ఘకాలంగా రాజకీయాల్లోఉన్న నేపథ్యంలో ఆయన దూకుడు అందరికీ తెలిసిందే. ఇక, వైసీపీ నుంచి గత ఎన్నికల్లో పార్టీ మారి టీడీపీలోకి వచ్చిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి విజయం దక్కించుకున్నారు. వైసీపీలో ఉన్నప్పుడు.. ఇప్పుడు కూడా ఆయన నోటికి, చేతికీ పనేమాత్రం తగ్గలేదు. నిలదీయాల్సిన చోట నిలదీయడంతోపాటు.. పనులు చేయాల్సిన చోట చేయించుకుంటున్నారు. ప్రజలకు చేరువ కూడా అవుతున్నారు.సొంత పార్టీ ప్రభుత్వమే ఉన్నా.. అధికారులు సరిగా పనిచేయకపోతే.. మాత్రం కడిగి పారేస్తున్నారు. ఇక, పార్టీ చేపడుతున్న కార్యక్రమాల్లోనూ.. పాల్గొంటూ.. ప్రజలకు కూటమి మేళ్లను వివరిస్తున్నారు. ఇక, కావలి నుంచి విజయం దక్కించుకున్న ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి.. ఉరఫ్ దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి సైతం.. మాటల్లో ఎక్కడా తగ్గడం లేదు. వైసీపీ నాయకులపై తరచుగా విమర్శలు చేస్తూనే ఉన్నారు. ఇటీవల మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి కేసులపై తరచుగా మీడియా ముందుకు వచ్చారు.ఇక, చేతల్లోనూ దూకుడుగానేఉన్నారు. అదేవిధంగా ఆత్మకూరు నుంచి విజయం దక్కించుకున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కూడా.. సౌమ్యంగానే ఉన్నా.. ఎక్కడ ఎలా స్పందించాలో అలా స్పందిస్తున్నా రు. ఆత్మకూరులో ఒకవైపు అభివృద్ధి పనులు చేస్తూనే.. మరోవైపు తరచుగా ఆయన వైసీపీని టార్గెట్ చేస్తున్నారు. ఇలా.. నెల్లూరు రెడ్లు.. మాట-చేతల్లోనూ టాప్ అని అనిపించుకోవడం గమనార్హం.

# తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతోంది?



హైదరాబాద్,బీజేపీ అంటేనే క్రమశిక్షణ గల పార్టీ. అధికారం కోసం, పదవుల కోసం కాకుండా సిద్ధాంతం కోసం పనిచేసే కార్యకర్తలు ఉంటారు. కానీ, మోదీ ప్రధాని అయ్యాక దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఇందుకోసం బీజేపీ వివిధ పార్టీల్లోని కీలక నాయకులను చేర్చుకుంది. దీంతో పార్టీ సిద్ధాంతం పక్కకుపోయింది. దీంతో పాత కొత్తల కలయిక కొన్ని రాష్ట్రాల్లో పార్టీకి ఇబ్బందిగా మారుతోంది. తెలంగాణలో కూడా అదే పరిస్థితి నెలకొంది. ఇందుకు మొన్న రాజీసింగ్, ఈ రోజు లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలే నిదర్శనం.తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేస్తామని హామీ ఇచ్చింది. ప్రధా మోదీ స్వయంగా ప్రకటించారు. ఈ ప్రకటన రాజకీయ చర్చకు దారితీసింది. ఈ క్రమంలో తాజాగా బీజేపీ నేత కె.లక్ష్మణ్, ఇతర రాష్ట్రాల్లో బీసీలను ముఖ్యమంత్రులుగా నియమించిన చరిత్రను గుర్తు చేస్తూ, ఈ హామీని పునరుద్ఘాటించారు. అదే సమయంలో, ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా, దానిని జాతీయ నాయకత్వం ఆమోదించడం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

బీసీ ముఖ్యమంత్రి హామీ..

బీజేపీ తెలంగాణలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా నియమిస్తామని 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించింది. ఈ హామీని పునరుద్ఘాటిస్తూ, బీజేపీ నేత కె.లక్ష్మణ్, ఇతర రాష్ట్రాల్లో బీసీ నేతలను ముఖ్యమంత్రులుగా చేసిన చరిత్రను ఉదాహరణగా చూపారు. ఈ ప్రకటన తెలంగాణలో బీసీ ఓటర్లను ఆకర్షించే లక్ష్యంతో చేసిన రాజకీయ వ్యూహంగా కనిపిస్తుంది, ఎందుకంటే రాష్ట్రంలో బీసీలు జనాభాలో సగానికి పైగా ఉన్నారు. బీసీ ఓటర్లు రాజకీయంగా నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. బీజేపీ ఈ హామీ ద్వారా బీసీ సమాజాన్ని ఏకతాటిపైకి తెచ్చి, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలతో పోటీ పడేందుకు ప్రయత్నిస్తోంది. అయితే, ఈ హామీ నిజమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందా లేక ఎన్నికల వ్యూహంగా మాత్రమే పరిమితమవుతుందా అనేది చర్చనీయాంశం.

రాజాసింగ్ రాజీనామా ప్రభావం..

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాను రాష్ట్ర బీజేపీ జాతీయ నాయకత్వానికి పంపింది, దానిని జాతీయ నాయకత్వం ఆమోదించింది. ఈ రాజీనామా బీజేపీలో అంతర్గత ఇబ్బందులను సూచిస్తుంది. రాజాసింగ్ రాజీనామా వెనుక బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించే ఉద్దేశం ఉందా లేక ఇతర రాజకీయ కారణాలు ఉన్నాయా అనేది స్పష్టంగా తెలియలేదు. ఈ రాజీనామా బీసీ సీఎం హామీతో నేరుగా సంబంధం కలిగి ఉందా అనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

బీజేపీ బీసీ నాయకత్వ చరిత్ర..

కె.లక్ష్మణ్, బీజేపీ ఇతర రాష్ట్రాల్లో బీసీలను ముఖ్యమంత్రులుగా నియమించిన చరిత్రను ఉదహరించారు. ఉదాహరణకు, ఉత్తరప్రదేశ్‌లో కల్యాణ్ సింగ్, బిహార్‌లో నితీష్ కుమార్ (సంబంధిత సమయంలో బీజేపీ మిత్రపక్షం) వంటి బీసీ నేతలు ముఖ్యమంత్రులుగా పనిచేశారు. తెలంగాణలో కూడా బీజేపీ గతంలో బీసీ నేతలైన చలపతిరావు, బండారు దత్తాత్రేయ, బండి సంజయ్‌లను రాష్ట్ర అధ్యక్షులుగా నియమించింది. అయితే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మాత్రం తాజాగా బీసీకి అధ్యక్ష పగ్గాలు అప్పగించకపోవడాన్ని తప్పు పడుతున్నాయి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీజేపీ బీసీలపై "మొసలి కన్నీరు" కారుస్తోందని, రాష్ట్ర అధ్యక్ష పదవిని బీసీలకు ఇవ్వలేదని ప్రశ్నించారు.

బీసీ సామాజిక వర్గంపై ప్రభావం..

ఇదిలా ఉంటే.. బీజేపీ అధ్యక్ష పగ్గాలు ఆ పార్టీలో అంతర్గత ఒత్తిడికి దారితీసినట్లు తెలుస్తోంది.గతంలో బీసీ నేతలైన ఈటల రాజేందర్, డీకే.అరుణ, ధర్మపురి అర్వింద్ వంటి వారిని ప్రముఖ పదవులకు పరిగణించినప్పటికీ, రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం బీసీ నేతను ఎంపిక చేయకపోవడం విమర్శలకు దారితీసింది.

# ధర్మాన లైన్ లోకి వచ్చినట్లేనా?



శ్రీకాకుళం:శ్రీకాకుళం జిల్లాలో సీనియర్ మోస్ట్ నాయకుడు మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు లైన్ లోకి వచ్చినట్లేనా అని పార్టీ వర్గాలలో చర్చ సాగుతోంది. ఏడాది కాలంగా ఆయన ఎక్కడా పార్టీ కార్యక్రమాల్లో పెద్దగా కనిపించడం లేదు. ఆయన రాజకీయాలకు గుడ్ బై చెప్పారని ప్రచారం సాగింది. అలా కాదు వేరే పార్టీలోకి వెళ్తారని ఇంకో ప్రచారం సాగింది.అయితే ఏ ప్రచారం సాగినా తిప్పుకొట్టకుండా ధర్మాన మౌనం వహించడంతో అదే నిజం అనుకున్న వారు ఉన్నారు. పార్టీ పెద్దలకు కూడా ఆయన మౌనం ఏమిటి అన్నది అర్థం కాని పరిస్థితిగా మారింది. అలాంటి ధర్మాన ప్రసాదరావు తాజాగా జరిగిన శ్రీకాకుళం నియోజకవర్గం స్థాయి సమావేశంలో పాల్గొనడమే కాకుండా కూటమి ప్రభుత్వం మీద నిప్పులు చెరిగారు.చంద్రబాబు మీద ఆయన సెటైర్లు పేల్చారు. కూటమి హామీలకు ఎవరు బాధ్యులో అర్థం కావడం లేదని అన్నారు. చంద్రబాబు అయితే ఇచ్చిన హామీలను నెరవేర్చరని ఆయన విమర్శించారు. బీజేపీ నాయకులు అయితే ఎన్నికల మ్యానిఫేస్తోని ఆనాడే ముట్టుకోకుండా తప్పుకున్నారని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ హామీల విషయం మీద చంద్రబాబుని అడిగలేకపోతున్నారని అన్నారు.ఉత్తరాంధ్రకు శ్రీకాకుళం జిల్లాకు కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోంది అని ధర్మాన విమర్శించారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలలోకి తీసుకుని వెళ్తమని ఆయన అన్నారు. దీంతో ధర్మాన ప్రసాదరావు ఇక మీదట చురుకుగా పార్టీ కార్యక్రమాలలో పాల్గొంటారా అని అంతా తర్కించుకుంటున్నారు. ఆయన సోదరుడు ధర్మాన క్రిష్ణదాస్ జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా ఉన్నారు ఆయన జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తూ అన్ని చోట్లా అందరినీ కోఆర్డినేట్ చేస్తున్నారని ప్రసాదరావు తిరిగి యాక్టివ్ కావడం వెనక ఆయన పాత్ర కూడా ఉందని అంటున్నారు. ధర్మాన సోదరులు జిల్లాలో కలసికట్టుగా పనిచేస్తే వైసీపీకి పూర్వ వైభవం తప్పకుండా దక్కుతుందని అంటున్నారు.

# 50 లక్షల ఉద్యోగాలిచ్చాం.. నెక్స్ట్ టార్గెట్ కోటి..



పాట్నా:బిహార్ ముఖ్యమంత్రి, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో యువతను ఆకర్షించేందుకు ఉత్సాహంగా ప్రయత్నిస్తున్నారు. గత ఐదేళ్లలో (2020-25) ఇచ్చిన ఉద్యోగాల హామీని తాము నెరవేర్చామని చెప్పారు. మొత్తం 50 లక్షల మందికి ఉపాధి కల్పించామని వెల్లడించారు. ఇందులో 10 లక్షల మందికి ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు, మిగిలిన 39 లక్షల మందికి ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు.

కోటి ఉద్యోగాల లక్ష్యం

నితీశ్ కుమార్ తదుపరి లక్ష్యాన్ని ప్రకటించారు. వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు ఇవ్వడమే తమ ప్రభుత్వ ప్రధాన టార్గెట్ అని వెల్లడించారు. ఈ టార్గెట్‌ను ప్రభుత్వ రంగం, ప్రైవేట్ రంగం, స్టార్టప్స్, వ్యవసాయం, స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా సాధించడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధమవుతోందని చెప్పారు. యువతకు స్థిర ఉపాధిని అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని నితీశ్ తెలిపారు.

ఎన్నికల ముంగిట రాజకీయ ప్రలోభాల విమర్శలు

నితీశ్ కుమార్ హామీలపై విపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఎన్నికల ముందు పెద్ద పెద్ద హామీలతో యువతను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తున్నాయి. గత హామీలను నెరవేర్చిన దానిపై సమగ్ర అంకెలతో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే, నితీశ్ కుమార్ మాత్రం తాము చెప్పిన ప్రతి మాటను నెరవేర్చామని, భవిష్యత్ లో మరింత మెరుగైన అవకాశాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేస్తున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com